

పులికాట్‌కు
జలకళేదీ?

ఏడాది పొడవునా జలకళతో కళకళతుండిన పులికాట్ సరస్సు నేడు ఎడారిని తలపిస్తోంది. సాధారణంగా జూన్, జూలై మొదటి వారంలో కురిసిన వర్షాలతో పులికాట్ జలకళ సంతరించుకునేది. వర్షపు నీరే కాకుండా ఆటుపోట్లతో సముద్ర జలాలు రావడంతో నిండుకుండను తలపించేది.జాలర్ల ముఖాల్లో కూడా ఆనందం వెల్లివిరిసేది. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో కుదిరి నుంచి సరస్సు అంచుల్లో మత్స్యకారులు చేపలను వేటాడేవారు. కొరిడి - పేర్నాడు, వేనాడు గ్రామాలకు వెళ్లే మార్గాల్లో రహదారి వెంబడి విసురు వలలు, తెరచాప పడవలతో వేట కొనసాగిస్తుంటే తీరం వెంబడి సందడి కన్పించేది. అయితే రెండు వారాలుగా తీరం వెంబడి వేడి గాలులు వీస్తూ ఎండలు కాస్తుండడంతో సరస్సులో ఉన్న నీరు అడుగంటి ఎడారిని తలపిస్తోంది.వర్షమొచ్చినప్పుడే నీరుండి మిగిలిన సమయాల్లో అడుగంటిపోతుండడంతో పులికాట్‌పై ఆధారపడి జీవించే జాలర్ల బతుకు ప్రశ్నార్థకంగా మారింది.ముఖద్వారాల్లో పూడికతీతతో పులికాట్‌కు పూర్వవైభవం తీసుకొస్తామంటూ వైసీపీ నేతలు ఐదేళ్లు మాటలతోనే కాలం వెల్లబుచ్చారు. ప్రస్తుత ప్రభుత్వమైనా పులికాట్‌కు పూర్వవైభవం తీసుకొస్తుందని మత్స్యకారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

- సూళ్లూరుపేట





శ్రీహరికోట సమీపంలో అడుగంటిన నీరు - అట్టకానితిప్ప వద్ద ఎడారిని తలపిస్తున్న పులికాట్

తీసుకోవాల్సిన చర్యలివే

పులికాట్ సరస్సులో ఏడాది పొడవునా నీరుండాలంటే సముద్రం, సరస్సుకు మధ్యలో ముఖద్వారాల పూడికతీత తీయాలి. వాకాడు మండలం పూడిరాయదొరువు, కొండూరుపాళెం వద్ద రెండు ముఖ ద్వారాలున్నాయి. అదే విధంగా తమిళనాడు పరిధిలోని పళ్లవర్కాడు వద్ద మరో ముఖద్వారం ఉంది. వరదల సమయంలో వచ్చే ఆటుపోట్లకు ఇసుకమేటలతో ముఖ ద్వారాలు పూడిపోయాయి. 20ఏళ్ల నుంచి పూడికతీత అంటున్నారే తప్ప పనులు ప్రారంభించలేదు. ముఖద్వారాల్లో పూడిక తీస్తే సముద్రం నుంచి ఉప్పునీరు సరస్సులోకి ప్రవేశించి ఏడాది పొడవునా పులికాట్ జలకళతో ఉంటుంది.

ముందుకు సాగని పూడికతీత పనులు

ఈ ప్రాంతానికి పర్యాటకంగా పేరొచ్చిందంటే పులికాట్ వల్లే. 15 ఏళ్లుగా సరస్సు అభివృద్ధికి చర్యలు తీసుకోలేదు. అభివృద్ధి పనులకు కేంద్రప్రభుత్వం అనుమతి తప్పనిసరి కావడంతో ప్రతిపాదనలు పంపినా జాప్యం జరుగుతోంది. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పూడికతీతకు చర్యలు చేపట్టి రూ.48 కోట్లు మంజూరు చేసింది. అనంతరం ప్రభుత్వం మారడంతో ఆచరణకు నోచుకోలేదు. కేంద్రప్రభుత్వం సాగరమాల ప్రాజెక్టు కింద రూ.100 కోట్లతో పనులు చేయిస్తామని ప్రకటించి హడావిడి చేసినా కార్యరూపం దాల్చలేదు.

విద్యానగర్ యూనియన్ బ్యాంక్‌లో
మంటలు

కీలక ఫైళ్లు దగ్ధం?



బ్యాంక్‌లోపల నష్టాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

కోట, జూలై 29 :కోట మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న యూనియన్ బ్యాంక్‌లో సోమవారం రాత్రి మంటలు ఎగిసిపడ్డాయి. బ్యాంక్ లోపల ఏమైందో తెలియదు కానీ 8 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు బయటకు చిమ్మాయి. ఒక పక్క వర్షం వస్తుండగా, చిట్టమూరు మండలం నార్త్‌వత్తూరుకు చెందిన ఓ యువకుడు అటువైపు వెళ్తూ మంటలను చూసి విద్యాసంస్థల సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు.కోట అగ్నిమాపక కేంద్రానికి సెక్యూరిటీ సిబ్బంది ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్‌తో వచ్చి మంటలను అతికష్టంపై ఆర్పారు. మేనేజర్ క్యాబిన్ నుంచి మంటలు కంప్యూటర్లున్న రూంలోకి పాకడంతో కంప్యూటర్లు, పలు కీలకమైన రికార్డులు పూర్తిగా కాలిపోయాయి.అయితే లాకర్‌కు, ఏటీఎంకు ప్రమాదం జరగలేదని బ్యాంక్ మేనేజర్ కిరణ్‌కుమార్ తెలిపారు.మంగళవారం బ్యాంక్ సేఫ్టీ అధికారులు వచ్చి ప్రమాదంపై పూర్తి వివరాలు సేకరిస్తారని చెప్పారు. బ్యాంక్‌లో మంటలు అదుపులోకి రావడంతో చుట్టుపక్కల నివాసం ఉంటున్న అధ్యాపకులు, హాస్టల్‌లో ఉంటున్న బాలికలు ఊపిరి పీల్చుకున్నారు.



బ్యాంక్ లోపల ఎగిసిపడుతున్న మంటలు



బ్యాంక్‌లోపల మిగిలిన ఫైళ్ల పరిశీలన

నాన్నా.. ఇదేం పని?

- చార్జింగ్ వైరుతో కుమార్తె మెడకు బిగించి హతమార్చిన తండ్రి

రొంపిచెర్ల, జూలై 29: చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలం పెద్దమల్లెల పంచాయతీ నడింపల్లెలో 9వ తరగతి చదివే గౌతమిని ఆమె తండ్రే కడతేర్చాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రొంపిచెర్ల ఇన్‌చార్జి అయిన కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. నడింపల్లెకు చెందిన కె.గౌతమి పెద్దమల్లెల జడ్పీఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. 16 నెలల క్రితం తల్లి మరణించింది. అవ్వ ఆదరణలో ఉండగా.. ఆమె కూడా ఆరు నెలల కిందట మృతి చెందింది. అనంతరం తండ్రి మునిరత్నం గౌతమిని పోషించేవాడు. తండ్రీ కూతుళ్ల మధ్య తరచూ చిన్న చిన్న గొడవలు వచ్చేవి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఆమె గొంతుకు సెల్‌ఫోను చార్జింగ్ వైరుతో బిగించడంతో ఆమె మృతిచెందింది. దీనిపై గౌతమి మేనమామ జయరాం సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎంఈవో-2 శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాగా చదివే విద్యార్థినిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.



మృతి చెందిన గౌతమి

లీగల్‌సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సస్పెన్షన్

- మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆఫీస్‌లో ఫైళ్ల కాల్చివేత కేసు ఎఫెక్ట్
- గతంలోనూ క్రమశిక్షణా చర్యలు
- పెద్దిరెడ్డికి సన్నిహితుడిగా ముద్ర

తిరుపతి(కలెక్టరేట్), జూలై 29: తిరుపతి జిల్లా లీగల్‌సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళీని సస్పెండ్ చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల కాల్చివేత కేసులో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు ఆర్డీవోలు సహా ఒక సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.వీరిలో మదనపల్లి ఆర్డీవోగా పనిచేస్తూ తిరుపతికి ఫిబ్రవరి మాసంలో బదిలీపై వచ్చిన మురళి ఒకరు. సుమారు పది రోజుల క్రితం అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను కొంతమంది దగ్ధం చేసిన విషయం తెలిసిందే. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో భారీఎత్తున ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడం... అనేక అవకతవకలు జరిగినట్లు గుర్తించడం..వీటిలో మురళీకి ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు రావడంతో సస్పెన్షన్ వేటు పడింది. మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మురళి అత్యంత సన్నిహితుడు.ఒంగోలులో పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో మదనపల్లెలో పని చేస్తుండగా సస్పెండ్ చేయడంతో పాటు తహసీల్దారుగా రివర్షన్ సైతం ఇచ్చారు.పెద్దిరెడ్డి జోక్యంతో సస్పెన్షన్ ఎత్తివేయడంతో పాటు రివర్షన్ కూడా ఉపసంహరించుకున్నారు. ఆరు నెలల క్రితం మురళి తిరుపతికి లీగల్‌సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు.



మురళి

హరోం హర

ఆలయాల్లో ఆడికృత్తిక సందడి



ఆనందగిరిపై భరణీ దీపోత్సవం



గుడువంకలో వీపునకు ఇనుప చువ్వలు గుచ్చుకొని క్రేన్ సాయంతో వేలాడుతూ ఆలయానికి వస్తున్న భక్తులు

ఆడికృత్తిక సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు 'హరోం హర' నామస్మరణతో మార్మోగాయి. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన ఆలయంలో సోమవారం రాత్రి నెమలి వాహనంపై వళ్లీ దేవసేన సమేత కుమారస్వామి పురవిహారం చేశారు.భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కర్పూర హారతులు సమర్పించారు.పాకాల మండలం ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన వళ్లీ దేవసేన సమేత కళ్యాణ సుబ్రమణ్యస్వామికి కాణిపాక దేవస్థానం తరఫున పట్టువస్త్రాలను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ సమర్పించారు.ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం భరణీ దీపోత్సవం వేడుకగా నిర్వహించారు.రాత్రి నెమలివాహనంపై సుబ్రమణ్యస్వామిని ఊరేగించారు. చిత్తూరు జిల్లా గుడుపల్లెలోని వేపమాను కొండపై వెలసిన సుబ్రమణ్యస్వామి దర్శనానికి వేలాదిమంది భక్తులు పోటెత్తారు. స్వామిమాలలు వేసుకొని కావళ్లు, తేరు కావళ్లు, నోటికి ఇనుప చూలాలు గుచ్చుకొని, శరీరం మొత్తం నిమ్మకాయలను గుచ్చుకొని, రాతి గుండును తాళ్లతో ఇనుప కొక్కీలను వీపునకు గుచ్చుకొని లాగుతూ, తేరు ఇనుప చువ్వలు గుచ్చుకొని, క్రేన్‌కు కొక్కీలతో వేలాడుతూ.. ఇలా వివిధ రూపాల్లో భక్తులు తమ గ్రామాల నుంచి డప్పువాయిద్యాలతో కొండపైకి చేరుకున్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి సోమవారం లక్షలాదిమంది భక్తులు తరలివచ్చారు.కొండ దిగువ, పైనా భక్తులు పూల కావళ్లు, పాల కావళ్లు, పన్నీరు కావళ్లు మోసుకెళ్లి స్వామి వారికి సమర్పించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



శ్రీకాళహస్తి మాడవీధుల్లో నెమలి వాహనంపై స్వామి అమ్మవార్ల ఊరేగింపు



తిరుత్తణిలో కావళ్ల సందడి

'పెద్దిరెడ్డి' గేట్లకు నోటీసులిస్తాం

- కార్పొరేషన్ ఖజానా ఖాళీ
- టీడీఆర్ బాండ్లు రాలేదన్న ఫిర్యాదులు ఎక్కువొస్తున్నాయ్
- తిరుపతి కమిషనర్ మౌర్య



తిరుపతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి):హైకోర్టు ఉత్తర్వులు ఎందుకు పాటించడంలేదన్న విషయంపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డికి నోటీసులు ఇస్తామని తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య చెప్పారు. ఆమె సోమవారం మీడియాతో చిట్‌చాట్‌గా కాసేపు మాట్లాడారు.హైకోర్టు ఆదేశాల మేరకు పెద్దిరెడ్డి ఇంటిముందున్న గేట్లు తెరిచి రెండు కాలనీలవాసులకు రాకపోకలను అనుమతించాలన్నారు. తొలుత రెండు గేట్లు తెరిచివుంచామని అనుకున్నామని, అయితే మధ్యలో మరో గేటుపెట్టినట్లు తెలిసిందన్నారు.ఈ విషయం కలెక్టర్ దృష్టిలో ఉందని, నోటీసులకు కూడా స్పందించకపోతే హైకోర్టు ఉత్తర్వుల మేరకు రాకపోకలకు అవకాశం కల్పిస్తామన్నారు. గడిచిన రెండేళ్లలో ఎక్కువగా నిధులు ఖర్చుచేయడం వలన కార్పొరేషన్ ఖజానా ఖాళీగా మారిందని, 15వ ఆర్థిక సంఘ నిధులు కూడా రావడంలేదన్నారు. దీనివలన కొత్తగా పనులు చేపట్టేందుకు బడ్జెట్ లేదన్నారు. అందువలన ప్రజలకు తక్షణమే అవసరమయ్యేవాటినే ఎంపిక చేసుకుని పూర్తిచేయనున్నట్లు తెలిపారు.మాస్టర్‌ప్లాన్ రోడ్లకోసం తీసుకున్న స్థలాలకు టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్) బాండ్లు అందలేదన్న ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, దాదాపు 700మందికి పైగా బాండ్లు ఇవ్వలేదని తెలిసిందన్నారు. దీనిపై ఇటీవల పురపాలక శాఖ మంత్రి నారాయణ సమీక్షా సమావేశం కూడా నిర్వహించారన్నారు. పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు అందరికీ బాండ్లు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.కార్పొరేషన్ యంత్రాంగాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కలెక్టరేట్‌లో ఒలంపిక్స్ సెల్ఫీపాయింట్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 29: పారిస్‌లో జరుగుతున్న ఒలంపిక్స్ క్రీడలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో సోమవారం సెల్ఫీపాయింట్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రారంభించారు. ఆయన ఫొటో దిగి ఒలంపిక్స్ పాల్గొన్న మన దేశ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఒలంపిక్స్‌లో మన క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.



సెల్ఫీ తీసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్వర్

కిడ్నాప్ కేసులో ఆర్ఎంపీ సహా నలుగురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), జూలై 29: తిరుపతికి చెందిన కొబ్బరికాయల వ్యాపారి జంగం భాస్కర్ కిడ్నాప్ కేసులో నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు.ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాకు కిడ్నాప్ కేసుకు సంబంధించి వివరించారు.చిన్నగొట్టిగల్లు మండలం చెరువుముందర పల్లెకు చెందిన జంగం భాస్కర్ తిరుపతిలో కొబ్బరికాయల వ్యాపారం చేస్తూ ఆటో నడుపుకుని జీవిస్తున్నాడు.ఇటీవల ఆర్థికంగా బాగా ఎదగడంతో అతడిని కిడ్నాప్ చేసి భారీ ఎత్తున డబ్బు సంపాదించవచ్చని చిన్నగొట్టిగల్లుకు చెందిన బాతుకోళ్ళ మహ్మద్ జీషాన్, ఇర్ఫాన్ పథకం పన్నారు. సొంత పనిమీద స్వగ్రామానికి వెళ్లిన భాస్కర్ ఈ నెల 24న ఉదయం 8.45 గంటల ప్రాంతంలో తన ఆటోలో తిరుపతికి వస్తుండగా జీషాన్, ఇర్ఫాన్ తమ స్నేహితులైన బెంగళూరులోని శివాజీనగర్‌కు చెందిన అర్శంఖాన్, లింగరాజుపురానికి చెందిన మహ్మద్ ఖాసిం సహాయంతో భాకరాపేట ఘాట్‌రోడ్డులోని పెట్రోలు బంకు సమీపంలో కిడ్నాప్ చేశారు. అతను అరవకుండా మహల్ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ షేక్ జాహిద్ బాషా నుంచి కొనుగోలు చేసిన మత్తు మందును భాస్కర్‌కు ఇచ్చారు. ఎలాగైనా కిడ్నాప్ చేసి భారీ ఎత్తున డబ్బులు డిమాండ్ చేయాలనే ఆలోచనతో అంతకుముందు భాస్కర్ కదలికలపై రెక్కీ నిర్వహించారు.భాస్కర్‌ను రోజంతా తమ కారులోనే వివిధ ప్రాంతాల్లో తిప్పారు. భాస్కర్ కుమారుడు కిరణ్‌కు ప్రధాన నిందితుడు మహ్మద్ జీషాన్ ఫోన్ చేసి రూ.5 కోట్లు తెచ్చివ్వాలని బెదిరించారు. దీంతో కిరణ్ ఎస్పీకి ఫోన్ చేసి కిడ్నాప్ విషయం తెలిపాడు.వెంటనే ఏఎస్పీ కులశేఖర్ నేతృత్వంలో క్రైం డీఎస్పీ రవికుమార్, సీఐలు శ్రీనివాసులు, శ్రీకాంత్ రెడ్డి, వినోద్‌కుమార్, సీఐ మస్తాన్ వలి నేతృత్వంలో గాలింపు చర్యలు చేపట్టారు.కిడ్నాప్ కోసం వాడుతున్న కారును 29న ఉదయం 7గంటల ప్రాంతంలో భాకరాపేట ఘాట్ రోడ్డులో ఊర్వా హోటల్ వద్ద గుర్తించారు.అయితే పోలీసు వాహనాన్ని ఢీకొట్టి పరారైన నిందితులను కాలూరు క్రాస్ వద్ద అరెస్టు చేశారు. కిడ్నాప్‌కు వాడిన కారు, డమ్మీ పిస్టల్, మత్తు ఇంజెక్షన్లు ఇవ్వడానికి వాడిన సిరంజీలను స్వాధీనం చేసుకున్నారు.ఇర్ఫాన్ తప్పించుకోగా ఆర్ఎంపీతో పాటు ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేశారు.ముద్దాయిల్లో మహ్మద్ జీషాన్ కిరాతకమైన నేర చరిత్ర కలిగిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.మిగిలిన వారిపైనా బెంగళూరు, చిన్నగొట్టిగల్లు ప్రాంతాల్లో ఎర్రచందనం, దోపిడీ, దొంగతనం కేసులున్నాయని, వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు.

నిందితులపై రౌడీషీట్ తెరిచేందుకు ఎస్పీ ఆదేశాలు



కిడ్నాపర్లను చూపించి వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు






లక్ష్మీపురం సర్కిల్‌లో.. - వెస్ట్ చర్చి అండర్ బ్రిడ్జి వద్ద..



జనం అవస్థ





జోరువాన



తిరుపతి అర్బన్, జూలై 29: తిరుపతిలో సోమవారం రాత్రి జోరు వాన కురిసింది. పగలంతా ఎండతీవ్రత కొనసాగింది. సాయంత్రం వాతావరణంలో మార్పుతో ఆకాశం మేఘావృతమైంది. రాత్రి తొమ్మిది గంటలకు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం ప్రారంభమైంది. దాదాపు గంట పాటు వర్షం కురవడంతో రోడ్లపై నీరు ఏరులా ప్రవహించింది. లోతట్టు ప్రాంతాలు, కొన్ని కూడళ్లు జలమయమయ్యాయి. బస్టాండులోనూ ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొన్నారు. అండర్ బ్రిడ్జిల వద్ద నీరు నిలవడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఉక్కపోత నుంచి జనం కొంత ఉపశమనం పొందారు.





ఎస్ఎంసీ వద్ద భారీగా కురుస్తున్న వర్షం - వానతో బోసిపోయిన శ్రీవారి ఆలయం ముందు భాగం

తిరుమలలోనూ..

తిరుమల, ఆంధ్రజ్యోతి: తిరుమలలో సోమవారం రాత్రి 8 నుంచి 10 గంటల వరకు భారీగా వాన కురిసింది. శ్రీవారి ఆలయ ప్రాంతంతోపాటు మాడవీధులు, పరిసర ప్రాంతాలు, కాటేజీలు, రోడ్లు, పార్కులు వంటి ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎత్తు ప్రదేశాల నుంచి వర్షం జోరుగా ప్రవహిస్తూ కనిపించింది. దర్శనానికి వెళ్లే వారితో పాటు దర్శనం చేసుకుని బయటకు వచ్చే భక్తులు ఇబ్బంది పడ్డారు. మరోవైపు జోరు వర్షంతో ఘాట్లలోనూ వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. చలితీవ్రత పెరిగింది.



ఆర్సీపురంలో పలు దఫాలుగా..

రామచంద్రాపురం: ఆర్సీపురం మండలంలో సోమవారం పలు దఫాలుగా వర్షం కురిసింది. రాత్రి 8 గంటల నుంచి ఏకధాటిగా రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. పొలాల్లో అరడుగులోతు నీరు నిలిచింది. వరి, వేరుశెనగ, చెరకు తోటలకు మేలు చేకూరుతుందని రైతులు అంటున్నారు.





ప్రత్యేక అలంకరణలో వళ్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యస్వామి - కాణిపాకం నుంచి పట్టువస్త్రాలను తీసుకొచ్చిన ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళిమోహన్ దంపతులు

ఆనందగిరిలో వైభవంగా ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు

కల్యాణ సుబ్రహ్మణ్యేశ్వరుడికి వరసిద్ధుడి పట్టువస్త్రాలు

పాకాల, జూలై 29: పాకాల మండలం ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన వళ్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలను చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్ దంపతులు తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఉదయం యాగపూజ, భరణీ అభిషేకం, షణ్ముఖ సహస్ర నామార్చన, ఉభయదారులు కె.కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో భరణీ దీపోత్సవం, నెమలి వాహనంపై స్వామి ఊరేగింపు

భరణీ దీపోత్సవం సాయంత్రం ఉభయదారులు మద్దినేని శ్రీనివాసుల నాయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి నెమలి వాహనంపై సుబ్రమణ్యస్వామి ఊరేగింపు సేవను ఉభయదారులు రాయ యశోదమ్మ, రెడ్డయ్య చౌదరి, రాయ సరస్వతి యుగంధర్ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వాహన సేవలో ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు, ఈవో యువరాణి, జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, సర్పంచ్ గౌరీశంకర్ రాజు, టీడీపీ సీనియర్ నాయకుడు వలపల దశరథనాయుడు, టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజనాయుడు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఆముదపాకల శ్రీహరి నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఆడికృత్తిక

ఆనందగిరిలో మంగళవారం ఆడికృత్తిక ఉత్సవం నిర్వహించనున్నారు. ఉదయం పాలకావడి, పాలాభిషేకం, స్వామివారి కళ్యాణోత్సం, రాత్రి ఊంజలసేవ, పుష్పపల్లకి సేవ జరుగుతాయి. దీనికోసం ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఆలయ ఆవరణ వరకు వాహనాలను అనుమతించరని నిర్దేశించిన ప్రదేశాల్లోనే పార్కింగ్ చేయాలని కమిటీ సూచించింది.



నెమలివాహనంపై సుబ్రహ్మణ్యస్వామి

భక్తులతో కిక్కిరిసిన పద్మగిరికొండ

బాల జ్ఞాన దండాయుధపాణికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే పులివర్తి నాని





స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న పులివర్తి నాని - విశేషాలంకారంలో స్వామి - ఆలయం వద్ద భక్తుల సందడి



తిరుచానూరు, జూలై 29: తిరుపతి రూరల్ మండలం తనపల్లె పంచాయతీలో పద్మగిరి కొండపై వెలసిన బాలజ్ఞాన దండాయుధపాణి స్వామి వారి ఆడికృత్తిక ఉత్సవాలు వేడుకగా జరిగాయి. కొండపైకి భక్తులు పోటెత్తారు. కొందరు భక్తులు కావడితో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారిని ఉదయం ఐదు గంటలకే సుప్రభాత సేవతో మేల్కొల్పి అభిషేకం చేశారు. తర్వాత పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని.. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పోలీసులు కొండపైకి ఎలాంటి వాహనాలను అనుమతించలేదు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కన్నులపండువగా కల్యాణోత్సవం

చంద్రగిరి, జూలై 29: చంద్రగిరిలోని శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయంలో ఆడికృత్తిక సందర్భంగా సోమవారం సాయంత్రం వళ్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు ప్రత్యేకాభిషేకాలు నిర్వహించి, విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ శైవాంగ పండితులు శివకుమార్ శర్మ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అనుపల్లెలో కావళ్లు

తిరుత్తణికి బయల్దేరిన భక్తులు

రామచంద్రాపురం: జూలై 29: ఆడికృత్తిక సందర్భంగా గంగిరెడ్డిపల్లె, అనుపల్లె గ్రామాల్లో కావళ్లు ధరించిన భక్తులు సోమవారం తిరుత్తణికి బయల్దేరి వెళ్లారు. ఆడికృత్తిక సందర్భంగా రాయలచెరువు కట్ట భవానీ జలకంఠేశ్వర ఉపాలయంలోని బాలసుబ్రహ్మణ్యంస్వామికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. యోగుల పర్వతంపై ఉన్న సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు చేశారు. ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్‌స్వామి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఇన్‌చార్జి తహసీల్దారుగా అన్వర్ బాషా



భాకరాపేట, జూలై 29: చిన్నగొట్టిగల్లు మండల ఇన్‌చార్జి తహసీల్దారుగా అన్వర్ బాషా సోమవారం బాధ్యతల చేపట్టారు. ఎన్నికల సమయంలో ఇక్కడకు వచ్చిన తహసీల్దారు నాగరాజు తిరిగి సొంత జిల్లాకు బదిలీ కావడంతో డీటీగా పనిచేస్తున్న అన్వర్ బాషాను ఇన్‌చార్జిగా నియమించారు.

క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య సిబ్బందితో టీడీపీ నాయకులు

భాకరాపేట, జూలై 29: చిన్నగొట్టిగల్లు మండలం దిగువూరు పంచాయతీలో స్విమ్స్ ద్వారా సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 43 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. టీడీపీ నాయకులు బెల్లంకొండ మురళి, రెడ్డిరమేశ్, మునికుమార్, రమణారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీటీఏ ఆవిర్భావ దినోత్సవం



జ్యోతిరావ్ పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు బీటీఏ నాయకుల పుష్పాంజలి

పాకాల, జూలై 29: బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఎస్వీఎస్ పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. జిల్లా అధ్యక్షుడు కె.రామచంద్రయ్య అధ్యక్షతన సభ నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావ్ పూలే, సావిత్రిబాయ్ పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు కృషి చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామమూర్తి, నాయకులు జి.ఆంజినేయులు, జ్యోతిప్రసాద్, ఆదికేశవులు, పి.జయబాల, విజయమోహన్, తులసీరామన్, వెంకటయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



చంద్రగిరి బాలికల, పచ్చార్లవాండ్ల పల్లె పాఠశాలల్లో భోంచేస్తున్న విద్యార్థులు



చంద్రగిరి, జూలై 29: దాతల సహకారం అభినందనీయమని ఎంపీడీవో వెంకట సూర్యసాయి అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏడు రోజుల శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం చంద్రగిరిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుభ దిన్ భోజనం కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు పోషక విలువలతో కూడిన భోజనాన్ని పెట్టారు. ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబు, దాతలు బీజేపీ నాయకులు మేడసాని పురుషోత్తంనాయుడు, నవీన్‌కుమార్‌రెడ్డి, హెచ్ఎం వెంకటరమణారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ రుక్మిణి, సభ్యులు కాత్యాయని, టీచర్లు పాల్గొన్నారు.

ఎర్రావారిపాలెం: పచ్చార్లవాండ్ల పల్లె ఉన్నత పాఠశాలలో టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో తిథి భోజనం ఏర్పాటు చేశారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, అంగన్వాడీ విద్యార్థులకు భోజనం పెట్టారు. టీడీపీ నాయకులు విజయారెడ్డి, సురేంద్ర బాబు, రాజు, దేవి, యుగంధర్, నాగార్జున, సుబ్రహ్మణ్యం, జయరామ్, జయపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెలపాటు శ్రీవారి పుష్కరిణి మూత

బ్రహ్మోత్సవాల సందర్భంగా శుద్ధి చేయనున్న టీటీడీ

తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పుష్కరిణి నెలరోజుల పాటు మూతపడనుంది. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముందు పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించి పైపులైన్లకు మరమ్మతులు, సివిల్ పనులు చేపట్టేందుకు ఆగస్టు నెలంతా మూసివేస్తారు. ఈ కారణంగా నెల రోజుల పాటు పుష్కరిణి హారతి ఉండదు. తొలి పదిరోజులు నీటిని తొలగిస్తారు. తర్వాత పదిరోజులు మరమ్మతులు ఏవైనా ఉంటే పూర్తిచేస్తారు. చివరి పదిరోజులు పుష్కరిణిలో నీటిని నింపి సిద్ధం చేస్తారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు



శంభాజీ - విజయ్‌కుమార్

తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సాంబశివరావు నాయుడు, రాజేశ్వరరావు, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి రవికుమార్, తమిళనాడుకు చెందిన ప్రముఖ డోలు వాయిద్య కళాకారుడు హరిద్వారమంగళం ఏకే పళనివేల్, ఛత్రపతి శివాజీ వారసుడు శంభాజీ, తెలంగాణ హాకీ జోన్ ఛైర్మన్, హోప్ ఫౌండేషన్ ఛైర్మన్ కొండ విజయ్‌కుమార్ ఉన్నారు. విజయ్‌కుమార్ దాదాపు ఐదు కిలోల బంగారు ఆభరణాలు ధరించి స్వామిని దర్శించుకున్న క్రమంలో భక్తులు ఆసక్తిగా చూశారు.

ప్రమాదకరంగా ఉన్న వృక్షాల తొలగింపు



ఎంబీసీ వద్ద వృక్షాలను తొలగిస్తున్న సిబ్బంది

తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ప్రమాదకరంగా ఉన్న వృక్షాలను టీటీడీ ఫారెస్ట్ అధికారులు సోమవారం తొలగించారు. మూడు వారాలుగా తిరుమలలో భారీ ఈదురుగాలులకు కొన్ని వృక్షాలు కూలేందుకు సిద్ధమయ్యాయి. దీనిపై 'తిరుమలలో ప్రమాదకరంగా భారీ వృక్షాలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఫారెస్టు అధికారులు కూలేందుకు సిద్ధంగా ఉన్న వృక్షాలను తొలగిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే కొండపై వృక్షాలను మూడు విభాగాలుగా విభజించామన్నారు. మొదటి విభాగం కింద పుచ్చిపోయిన, పూర్తిగా చనిపోయిన చెట్లు ఉంటాయన్నారు. రెండో భాగంలో కొంతమేరకు దెబ్బతిన్న, సున్నితంగా ఉన్న వృక్షాలు, మూడో విభాగంలో బరువు అధికంగా ఉండి బలంగా ఉన్న చెట్లు ఉంటాయన్నారు. కొద్దినెలలుగా మొదటి విభాగంలోని వృక్షాలను తొలగిస్తూ వస్తున్నామన్నారు. ఇప్పటికే 60 శాతం పూర్తయ్యాయన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అన్న క్యాంటీన్లు విస్తరిస్తాం : ఎమ్మెల్యే ఆరణి



ఈఎస్ఐ ఆస్పత్రి సమీపంలోని అన్న క్యాంటీన్ వద్ద కమిషనర్, ఎమ్మెల్యే, నాయకులు

తిరుపతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాలుగు అన్న క్యాంటీన్లు ఒకే ప్రాంతంలో ఉన్నాయని, మరో రెండింటిని జీవకోన, ఆటోనగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. నగరంలో మరమ్మతులు జరుగుతున్న నాలుగు అన్న క్యాంటీన్లను సోమవారం కమిషనర్ మౌర్యతోకలిసి ఎమ్మెల్యే, కూటమి నేతలు పరిశీలించారు. పేదలకు నాణ్యమైన భోజనం రూ.ఐదుకే అందించాలన్న సీఎం చంద్రబాబు ఆకాంక్షకు అనుగుణంగా స్వాతంత్ర దినోత్సవం నాడు అన్న క్యాంటీన్లను ఎన్డీఏ ప్రభుత్వం ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నాయకులు దంపూరు భాస్కర్ శ్రీధర్ వర్మ, బుల్లెట్ రమణ, సురా సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు, ఆముదాల తులసీరామ్, ఊట్ల సురేంద్ర నాయుడు, చిన్నబాబు, మధు, రాము, కొట్టే హేమంత్, జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి, నెలవాయి మురళి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదుకు గడువు పొడిగింపు

తిరుపతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు టార్గెట్ తిరుపతి నియోజకవర్గం దాటిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. పదివేల మంది టార్గెట్ కాగా.. ఆదివారం నాటికి 14వేల మంది చేరారన్నారు. సభ్యత్వ నమోదు ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్న జనసైనికులు, వీరమహిళలు, పవన్ కల్యాణ్ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా అధినేత ఆదేశాలతో సభ్యత్వ నమోదు గడువును ఆగస్టు ఐదో తేదీవరకు పొడిగించారని చెప్పారు. సభ్యత్వ రుసుం కింద సభ్యులు రూ.500 కడితే పవన్ కల్యాణ్ తన సొంత డబ్బును రూ.1500 ఒక్కో సభ్యత్వానికి చెల్లిస్తున్నారన్నారు.

టీటీడీలో అన్ని విభాగాలపై విచారణ జరిపించండి : జనసేన

తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గత ప్రభుత్వం హయాంలో అవినీతి, అక్రమాలు ఎక్కువగా జరిగాయని జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ అన్నారు. ఈమేరకు సోమవారం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అన్ని విభాగాలపై విచారణ జరిపించి పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని కిరణ్ కోరారు.

ఇద్దరు ఏఎస్ఐలకు పదోన్నతి

తిరుపతి(నేరవిభాగం), జూలై 29: తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఏఎస్ఐలకు పదోన్నతి లభించింది. తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న జి.నాగరాజును చిత్తూరుకు బదిలీ చేశారు.పార్థసారధిని తిరుపతిలోనే నియమించారు.

మరో ఆటోనగర్‌కు దరఖాస్తు

తిరుపతి అర్బన్, జూలై 29: రెండో ఆటోనగర్‌కు స్థలం కేటాయించాలని తిరుమలేశ ఆటోమొబైల్స్ వర్క్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సోమవారం నగరపాలక సంస్థలో దరఖాస్తు చేసుకుంది. ఆటోనగర్‌లో స్థలాభావంతో ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో శెట్టిపల్లె పంచాయతీలో పాతిక ఎకరాల స్థలం కేటాయించాలని నగరపాలక సంస్థలోని అర్బన్ తహసీల్దార్ చాంబర్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తమ సమస్యను పరిష్కరించాలని కార్యాలయం వద్ద బ్యానర్లను ప్రదర్శించారు.

మత్తు పదార్థాలు నివారించండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 29: పద్మావతి మహిళా వర్సిటీలో మత్తు పదార్థాలను నివారించాలని ఇన్‌చార్జి వీసీ ఉమను విద్యార్థి సంఘాలు కోరాయి. చిన్న (ఏఐఎస్ఎఫ్), అక్బర్ (ఎస్ఎఫ్ఐ), ఉష (పీడీఎస్‌ఓ), మల్లికార్జున (ఎన్ఎస్‌యూఐ) కలిసి సోమవారం వినపతిపత్రం అందజేశారు. అలాగే హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ● డ్రగ్స్ నివారణకు విద్యార్థులు, యువత నడుం బిగించాలని కోరుతూ తెలుగు యువత రూపొందించిన పోస్టర్‌ను ఎస్వీయూలో ఇన్‌చార్జి వీసీ అప్పారావు విడుదల చేశారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్, నాయకులు పత్తిపాటి వివేక్ చౌదరి, డాక్టర్ రాంబాబు, రామ్మోహన్, ఆర్కే నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంచుకోండి



తిరుపతి(విద్య), జూలై 29: విద్యార్థిదశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలని నారాయణ స్కూల్స్ ఏజీఎం కిశోర్ తెలిపారు. న్యూ ఇందిరా నగర్‌లోని పాఠశాలలో సోమవారం అధిష్టాన సేవాకార్యక్రమం పేరిట విద్యార్థి నాయకుల ఎన్నికలు బ్యాలెట్‌పేపర్ ద్వారా నిర్వహించారు. ఆర్ఐ వసంత్ కుమార్, ప్రిన్సిపాల్ హిమజ, ఆర్ఎస్‌టీ సాయికృష్ణ, ఎస్ఎస్‌టీ హర్షవర్థిని, పీఈటీ అశోక్, టీచర్లు పాల్గొన్నారు.

జూపార్కులో పులుల దినోత్సవం


విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న క్యూరేటర్ సెల్వం

మంగళం, జూలై 29: ఎస్వీ జూపార్కులో సోమవారం ప్రపంచ పులుల దినోత్సవం సెట్విన్ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పులులను పరిరక్షించడం, పర్యావరణాన్ని కాపాడుకోవడం అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. జూ క్యూరేటర్ సెల్వం మాట్లాడుతూ.. విద్యార్థులకు పెద్దపులుల ప్రాధాన్యం, అడవులు ప్రాముఖ్యతను వివరించారు. అధికారులు జగదీష్, నాగభూషణం, మురళీకృష్ణ, చంద్రప్రసాద్ పాల్గొన్నారు.

1న విష్ణు సహస్ర నామ అఖండ జప యజ్ఞం


నాగేంద్రసాయి

తిరుపతి (జీవకోన), జూలై 29: ఆలిండియా విష్ణు సహస్ర నామ కల్చరల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు ఒకటో తేదీన తిరుమల ఆస్థాన మండపంలో విష్ణు సహస్ర నామ అఖండ జప యజ్ఞం చేపడుతున్నట్లు ఫెడరేషన్ ఛైర్మన్ నాగేంద్రసాయి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. జనహితం కోరుతూ 35 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. 1న ఉదయం ఆరు గంటల నుంచి మొదలుపెట్టి రెండో తేదీ ఉదయం 10గంటల వరకు నిరంతరాయంగా 27 గంటలపాటు జపయజ్ఞం జరుగుతుందన్నారు. తిరుమల జీయరు స్వాములతో యజ్ఞం ప్రారంభమవుతుందన్నారు. ముగింపు కార్యక్రమానికి అహోబిలం జీయర్ స్వామి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ హాజరవుతారన్నారు. రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో శ్రీవాణి టికెట్ల జారీకి శాశ్వత కౌంటర్

- స్థలాలను పరిశీలించిన అదనపు ఈవో

తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవాణి ట్రస్టు భక్తులకు దర్శన టికెట్లు కేటాయించేందుకు శాశ్వత కౌంటర్ నిర్మాణం కోసం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి పలు ప్రాంతాలను పరిశీలించారు. గోకులం వెనుకభాగంలోని ఉన్న ఖాళీ స్థలాన్ని, ఆదిశేష విశ్రాంతి గృహం పక్కనే ఉన్న టీటీడీ కల్యాణమండపం ప్రాంతం, తిరుమల డీఎఫ్‌వో కార్యాలయాన్ని జేఈవో వీరబ్రహ్మంతో కలిసి సోమవారం పరిశీలించారు. భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా విశాలమైన ప్రదేశాన్ని ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీఈవో సెల్వం, ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి టీటీడీ సారె



తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి తిరుమల శ్రీవారి తరఫున పట్టువస్త్రాలను టీటీడీ ఈవో శ్యామలరావు సోమవారం సమర్పించారు. టీటీడీ అధికారులకు తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి ఆలయ ఛైర్మన్ శ్రీధర్, జాయింట్ కమిషనర్ అరుణాచలం, తిరుత్తణి ఆలయ బోర్డు సభ్యులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈవోతోపాటు డిప్యూటీ ఈవో లోకనాథం, పారుపత్తేదార్ తులసి ప్రసాద్, వేదపారాయణదారులు ఉన్నారు.

ముస్తాబవుతున్న 'అన్నమయ్య' మీటింగ్ హాల్



తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అధికారులు, బోర్డు సమావేశాలు జరిగే అన్నమయ్య భవనంలోని సమావేశం మందిరం (మీటింగ్ హాల్) ముస్తాబవుతోంది. బోర్డు సమావేశాలతోపాటు డయల్ యువర్ ఈవో, ఈవో, జేఈవోల సాధారణ సమావేశాలన్నీ ఈ సమావేశం మందిరంలోనే జరుగుతుంటాయి. ఈ హాల్ మరమ్మతులకు గురవడంతో కొద్దినెలల క్రితం ఆధునికీకరణ పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం పనులు దాదాపుగా పూర్తకావచ్చాయి. దీంతో మీటింగ్ హాల్‌ను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఆధ్యాత్మిక వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం

సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు



తిరుపతి(ఆటోనగర్), జూలై 29: వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యమని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు తెలిపారు. తిరుపతిలోని డిస్కం కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వినియోగదారులకు సేవలందించడలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మొండి బకాయిలను వసూలుపై దృష్టి పెట్టాలన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే వినియోగారులు టోల్ ఫ్రీ నెంబరు 1912, 180042515533కు కాల్ చేయాలని సూచించారు. వాట్సాప్ 91333 31912 నెంబరును కూడా ఉపయోగించుకోవాలని కోరారు. సీజీఎంలు కేఆర్ఎస్ ధర్మజ్ఞాని, ఆర్.పద్మ, ఎస్ఈలు సురేంద్ర నాయుడు, విజయన్, రమణ, ఉమాపతి, సంపత్ కుమార్, ఈఈలు, ఎస్ఏవో, ఏఏవోలు పాల్గొన్నారు.

వాటర్ బాటిల్ విషయమై ఘర్షణ


చంద్రబాబు, అనుజ నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు, దాడిలో గాయపడిన గార్డు

తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వాటర్ బాటిల్ విషయంలో భక్తులు, దుకాణదారుల మధ్య ఘర్షణ జరిగింది. పరస్పరం దాడికి దిగడంతో తిరుమలలోని ఎంబీసీ వద్ద కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వైజాగ్‌కు చెందిన చంద్రబాబు, అనుజ దంపతులు శ్రీవారి దర్శనార్థం తమ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం శ్రీవారి మెట్టు మార్గం ద్వారా తిరుమలకు చేరుకున్నారు. ఎంబీసీ వద్ద ఉన్న ఓ దుకాణంలో చంద్రబాబు కుమారుడు రూ.60 చెల్లించి ఓ వాటర్ బాటిల్ కొని తీసుకొచ్చాడు. అయితే ఆ బాటిల్ సీల్ తెరిచి ఉందని అనుజ తిరిగి దుకాణం వద్దకు చేరుకుంది. మరోబాటిల్ ఇవ్వాలని కోరింది. దీనిపై దుకాణదారుడు సురేష్, అనుజ మధ్య గొడవ మొదలైంది. గమనించిన చంద్రబాబు కూడా దుకాణం వద్దకు చేరుకున్నాడు. మాటా మాటా పెరిగి పరస్పరం దాడి చేసుకునే వరకు వెళ్లింది. సమీపంలో ఉన్న ఓ సెక్యూరిటీ గార్డు సర్దిచెప్పేందుకు వెళ్లగా అతడికి కూడా గాయాలయ్యాయి. దుకాణదారుడు ఓ వాటర్‌బాటిల్‌తో చంద్రబాబు తలపై కొట్టడంతో గాయపడ్డాడు. అనుజకు గాయాలవడంతో ఇద్దరూ అశ్విని ఆస్పత్రికి వెళ్లారు. ఈ సమాచారంతో తిరుమల టూటౌన్ పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని భక్తుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. కాగా, చంద్రబాబు, అనుజ కానిస్టేబుళ్లని తెలిసింది. ఈ అంశంపై బాధితుడు చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. వేరే బాటిల్ ఇవ్వమని కోరిన తన భార్యను దుకాణదారుడు సురేష్ దుర్భాషలాడటమే కాక, అతడి భార్య, అత్తతో కలిసి దాడి చేశాడని తెలిపారు. పైగా మోకాలితో తన భార్యను కడుపులో తన్నాడని చెప్పారు. భక్తులతో మర్యాదగా నడుచుకోని ఇలాంటి వ్యక్తులకు తిరుమలలో దుకాణాలు ఇవ్వకూడదని కోరారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.93 కోట్లు

తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.98 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 79,327 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 25,894 మంది తలనీలాలు సమర్పించారు.

ఎస్పీకి అభినందనలు



తిరుపతి(నేరవిభాగం), జూలై 29: ఎస్పీ ఎల్.సుబ్బరాయుడిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం మాజీ ఉపాధ్యక్షుడు కలికిరి గోవిందరావు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు. పోలీసు అధికారుల సంక్షేమంపై కొంతసేపు చర్చించుకున్నారు.

ప్రొఫెసర్ రంగనాథన్‌కు పురస్కారం



తిరుపతిరూరల్, జూలై 29: తిరుపతికి చెందిన జాతీయ సంస్కృత వర్సిటీ సాహిత్య విభాగ ప్రొఫెసర్ చక్రవర్తి రంగనాథన్‌కి ప్రవచన చక్రవర్తి పురస్కారం లభించింది. కడపజిల్లా గండికోట క్షేత్రంలో అఖిల భారతీయ బ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో గురు పురస్కారం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఈ బిరుదుతో సత్కరించారు. తిరుమల శ్రీవారి, పద్మావతి అమ్మవార్ల ప్రవచనాలను చేస్తూ, తద్వారా ఆధ్యాత్మికశక్తి విస్తరణకు ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈపురస్కారాన్ని ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు ఫొటో, వీడియో గ్రాఫర్స్ జేఏసీ సమావేశం

తిరుపతి (జీవకోన), జూలై 29: ఆంధ్రప్రదేశ్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ జేఏసీ ఆత్మీయ సమావేశం మంగళవారం ఉదయం 10గంటలకు కర్ణాలవీధిలోని గురులక్ష్మి రెసిడెన్సీలో నిర్వహించనున్నారు. ఈ మేరకు జేఏసీ మాజీ ఉపాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు తెలిపారు. జేఏసీ ప్రతినిధులు రఫీ, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో చేసిన ఆరోపణలు అవాస్తవం

సమతా సైనిక్ దళ్

తిరుపతి (జీవకోన), జూలై 29: డీఎంహెచ్‌వో శ్రీహరి తమపై చేసిన ఆరోపణలు అవాస్తవమని సమతా సైనిక్ దళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గండికోట సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. వివిధ పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా డీఎంహెచ్‌వోపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే కలెక్టర్ విచారణకు ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. ఫిర్యాదు చేశామన్న అక్కసుతో పథకం ప్రకారం తనను ఆయన ఇంటి వద్దకు పిలిపించుకుని.. డబ్బులు డిమాండ్ చేసినట్లు చెప్పడం సమంజసం కాదన్నారు. నాగార్జున, నాగేంద్ర, వరుణ్, లాలుప్రసాద్ యాదవ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

సీడీసీ డీన్‌గా చెంద్రాయుడు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 29: ఎస్వీయూ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) డీన్‌గా ప్రొఫెసర్ ఎన్.చెంద్రాయుడు నియమితులయ్యారు. ఇప్పటి వరకూ సీడీసీ డీన్‌గా ఉన్న అప్పారావు వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా వెళ్లారు. దాంతో చెంద్రాయుడిని నియమించారు. దామలచెరువుకు చెందిన 2007లో ఎస్వీయూలో అధ్యాపకులుగా చేరారు. ఈయన పర్యవేక్షణలో 7 పీహెచ్‌డీలు, 6 ఎంఫిల్‌లు పూర్తయ్యాయి. నేషనల్ జాగ్రఫికల్ జర్నల్‌కు ఎడిటోరియల్ మెంబర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఎస్వీయూలో తనిఖీలు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 29: ఎస్వీయూలో ఇన్‌చార్జి వీసీ అప్పారావు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎగ్జామ్స్, అకడమిక్, ఫైనాన్స్ విభాగాలను సోమవారం పరిశీలించారు. ఉద్యోగులు సమయ పాలన పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పద్మశ్రీ పళనివేల్‌కు సత్కారం



తిరుపతి (కల్చరల్), జూలై 29: ప్రముఖ సంగీత కళాకారుడు, పద్మశ్రీ హరిద్వారమంగళం ఏకే పళనివేల్‌ను వాయిద్యకళాకారుల సంఘం అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం సోమవారం సత్కరించారు. తిరుపతిలోని త్యాగరాజస్వామి ట్రస్టు 80వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం త్యాగరాజ మండపంలో జరిగిన సభా కార్యక్రమంలో ఏకే పళనివేల్‌కు సప్తగిరి సంగీత విద్వన్మణి బిరుదు ప్రదానం జరిగింది. నాదస్వర విద్వాంసుడు ఎస్.మునిరత్నం పాల్గొన్నారు.

ఇంట్లో విద్యుత్ షార్టు సర్క్యూట్

● రూ.10 లక్షల ఆస్తి నష్టం

తిరుపతి(నేరవిభాగం), జూలై 29: ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దాదాపు రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. భవానీనగర్ వీధిలోని ఓ ఇంట్లో మెడికల్ రెప్రజెంటేటివ్ పి.రాజశేఖర రెడ్డి కాపురమంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం కుమారుడి కోసం భార్యతో కలసి స్కూలు వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. బీరువాలోని బంగారు నగలు, వెండి వస్తువులు, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. దట్టమైన పొగలు అలుముకోవడంతో మంటలను అదుపు చేయడం కొంత కష్టమైంది.

రూ.లక్ష ఆస్తినష్టం

రాజశేఖర్ ఇంటి పక్కనే ఖజానాశాఖలో పనిచేస్తున్న గోపి ఇంటికి కూడా మంటలు వ్యాపించి, దాదాపు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగింది. ఈ మేరకు అగ్నిమాపక సిబ్బంది కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగదీష్‌కుమార్‌పై దాడిచేసిన వైసీపీ యువతపై చర్యలు తీసుకోండి

తిరుపతి (జీవకోన), జూలై 29: చౌడేపల్లె మండలానికిచెందిన జగదీష్‌కుమార్(32)పై దాడిచేసిన వైసీపీ యువతపై పోలీసులు చర్యలు తీసుకోవాలని హైకోర్టు లాయర్ యండమూరి చరణ్‌కుమార్ కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో బాధితుడు జగదీష్‌కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. 25వ తేదీ రాత్రి 10గంటల సమయంలో జగదీష్‌కుమార్‌పై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారన్నారు. వైసీపీకి చెందిన కొంతమంది యువత ఆయన ఇంటి వద్ద వచ్చి ఎన్నికల్లో టీడీపీ తరఫున ఎలా పనిచేస్తావంటూ రాడ్లు, రాళ్లతో దాడి చేశారని చెప్పారు. దీనికి సంబంధించిన ఆధారాలన్నీ తమ వద్ద ఉన్నాయని తెలిపారు. బాధితుడు మాట్లాడుతూ.. తాను ఆటో నడుపుకుని జీవనం సాగిస్తున్నానని.. ఇష్టానుసారం దాడి చేయడంతో కన్ను కోల్పోయి, జీవనోపాధి పోయిందని, తనకు అధికారులు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో హేమలత, అమృత్, లీలాకుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్లూ.. కామన్‌మ్యాన్‌కి అవకాశమివ్వండి

పీజీఆర్ఎస్‌కు నాయకులు క్యూ కడుతుండటంతో ఇబ్బంది పడుతున్న జనం


కమిషనర్‌కు సమస్యలు తెలియజేస్తున్న డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

తిరుపతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వారంతా కార్పొరేటర్లు.. కమిషనర్‌ను కలిసి సమస్యలు చెప్పుకోవడానికి వారికే సమయంలోనైనా తలుపులు తెరుచుకుంటాయి. కానీ ప్రచార ఆర్భాటం కోసమో, ఉనికి చాటుకోవడానికో తెలియదు కానీ సాధారణ జనం కోసం సోమవారం ఏర్పాటు చేసే ప్రజా పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను వాడుకునేందుకు ఇష్ట పడుతున్నారు. వీరే ప్రధాన ఫిర్యాదుదారులుగా మారుతున్నారు. దీనివల్ల ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతోపాటు వారి సమస్యలు సావధానంగా వినే అవకాశం, సమయం కమిషనర్‌కు లేకుండా పోతోంది. సోమవారం ఫిర్యాదు చేస్తేనే అధికారికంగా నమోదవుతాదన్న భావనతో వస్తున్నట్టు చెబుతున్నప్పటికీ కార్పొరేషన్ పాలనలో భాగమైన కార్పొరేటర్లు వారి సమస్యను చెప్పుకోవడానికి, వాటిని పరిష్కరించుకోవడానికి ఎప్పుడైనా వెసులుబాటు ఉంటుంది. ఒకవేళ పరిష్కారం కాకపోతే మూడు నెలలకోసారి జరిగే కౌన్సిల్ సమావేశంలో వాటిని నిలదీసే అధికారమూ ఉంటుంది. అలాకాకుండా పీజీఆర్ఎస్‌నే పరమావధిగా భావించి కార్పొరేటర్లు, కూటమి నేతలు కార్పొరేషన్‌కు వినతిపత్రాలు చేతబట్టుకుని రావడం సాధారణ ప్రజలకు విచిత్రంగా కనిపించింది. గత ప్రభుత్వ హయాం నుంచే ఇదేపంథా సాగుతున్నప్పటికీ, ఈ సంప్రదాయానికి కొత్త కమిషనర్ మౌర్య బ్రేక్ వేసేందుకు చర్యలు తీసుకుంటారేమో చూడాలి.

స్నాక్స్ కోసం రూ.3కోట్లా?

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్‌ని కలిసిన డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ.. నగరంలో చాలా ప్రదేశాల్లో అనుమతులు లేని ఫ్లెక్సీలు రోజులు తరబడి ఉన్నాయని, అదేవిధంగా రహదారులపై గుంతలను ప్యాచ్ వర్కులు చేసే కార్పొరేషన్ సిబ్బందికి వాహనాలు సమకూర్చాలని కోరగా కమిషనర్ పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె.బాబు, నరసింహాచారి.. కార్పొరేషన్లో మూడేళ్లుగా టీ, కాఫీ, బిస్కట్ల (స్నాక్స్)కోసమే రూ.3కోట్లు ఖర్చు పెట్టారని, 'ఎస్-క్రో' అకౌంట్ నుంచి పెద్దఎత్తున నిధుల దుర్వినియోగమయ్యాని, సిబ్బంది నియామకాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. కార్పొరేటర్లు ఆర్సీ మునికృష్ణ, కోటూరి ఆంజినేయులు, దొడ్డారెడ్డి ప్రవళ్శికా రెడ్డి, నరేంద్రనాథ్, అనీల్, అన్నా అనితా యాదవ్, దూది శివకుమారి తదితరులు కమిషనర్‌ని కలిసి తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. కపిలతీర్థం సర్కిల్లో కార్పొరేషన్ నిర్మించిన హోటల్ వివరాలను, వైసీపీ ప్రభుత్వంలో సిబ్బంది నియామకాల గురించి సమాచారం కావాలని టీడీపీ నగరాధ్యక్షుడు చినబాబు కమిషనర్ని కోరారు. ప్రధాన సమస్యల్లో.. శ్రీనివాస నగర్ కూడలిలో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని, లీలామహల్ దగ్గరున్న చేపల మార్కెట్టును మార్చాలని, హరిచంద్ర శ్మశానవాటికలో శవ దహనాల వలన కాలుష్యం ఏర్పడుతున్నదని, అశోక్ నగర్, అబ్బన్న కాలనీలోని కాలువల్లో పూడిక తీయాలని, పద్మావతి పార్కులో సౌకర్యాలు కల్పించాలని, కొన్ని ప్రాంతాల్లో రోడ్లు పాడయ్యాయంటూ వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ మోహన్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఆర్వోలు సేతుమాధవ్, కె.ఎల్.వర్మ, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, డీఈలు, సూపరింటెండెంట్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

- అధికారులకు అర్జీదారుల వేడుకోలు
- కలెక్టరేట్‌లో 'పీజీఆర్ఎస్'కు 146 అర్జీలు


బాధితురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 29: తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులను అర్జీదారులు వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు జిల్లా నలుమూలల నుంచి బాధితులు తరలివచ్చారు. మొత్తం 146 అర్జీలు అందాయి. వీటిల్లో రెవెన్యూశాఖకే 94 ఉండటం గమనార్హం. పీజీఆర్ఎస్‌కు వచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. అర్జీలను కలెక్టర్‌తోపాటు డీఆర్వో పెంచలకిషోర్, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, కోదండరామిరెడ్డి, రామ్మోహన్ తదితరులు స్వీకరించారు.

నకిలీ ఇంటి పట్టా ఇచ్చిన వీఆర్వో



బీఎన్‌కండ్రిగ కల్లివెట్టులో నా అనుభవంలో ఉన్న స్థలాన్ని పద్మ అనే మహిళ పేరుతో నకిలీ పట్టాను వీఆర్వో ఇచ్చారు. పైగా నా స్థలంలోని పశువుల పాకను కూల్చి వేరే వ్యక్తులకు స్వాధీనం చేశారు. విచారించి, న్యాయం చేయండి.

- వెంకటమ్మ, కల్లివెట్టు, బీఎన్‌కండ్రిగ

ఆస్తిలో వాటా అడిగితే చంపుతారంట



పుట్టుకతోనే చూపులేదు. నా భర్తకు కూడా చూపు లేదు. వెదురుకుప్పం మండలం మాంబేడులో మా తల్లిదండ్రులకు చెందిన ఆస్తులున్నాయి. సోదరి, తమ్ముళ్లు మా తల్లిదండ్రుల ఆస్తులను అమ్ముకుంటున్నారు. నా వాటా అడిగితే నన్ను, మా పిల్లలను చంపేస్తామని బెదిరిస్తున్నారు. మీరైనా న్యాయం చేయండి.

- రేవతి, గంగుండ్రంపల్లె, చంద్రగిరి

ఎస్సీ కార్పొరేషన్‌కు పూర్వవైభవం తీసుకురండి



రాష్ట్రంలో దళితులు 20శాతం మంది ఉన్నారు. ఐదేళ్లుగా జగన్ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌ను మూతవేసింది. వెంటనే కార్పొరేషన్‌కు పూర్వవైభవం తీసుకురండి.

- కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్

వ్యవస్థలను నిర్వీర్యం చేసిన జగన్

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

తిరుపతి (జీవకోన), జూలై 29: రాష్ట్రంలోని వ్యవస్థలన్నింటినీ మాజీ సీఎం జగన్ నిర్వీర్యం చేశాడని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ మండిపడ్డారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ తగులబెట్టడంపై ఆగ్రహించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. ఆంధ్రాలో ఓ కుటుంబం, తెలంగాణలో ఓ కుటుంబం వల్లే తెలుగు ప్రజలు కష్టాలు పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీ కార్పొరేషన్ కొనసాగిస్తూ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై టీటీడీ ఏడీ బిల్డింగ్ ముందు కూడా చింతామోహన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.

విద్యావ్యవస్థను పటిష్ఠం చేయండి

కలెక్టర్‌కు ఆపస్ నేతల విజ్ఞప్తి


కలెక్టర్‌తో మాట్లాడుతున్న బాలాజీ తదితరులు

తిరుపతి(విద్య), జూలై 29: జిల్లాలో ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) నాయకులు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన్ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి గట్ల సాంబిరెడ్డి, జిల్లా సహాధ్యక్షుడు డాక్టర్ ఎం. దేవరాజులు, మహిళా కన్వీనర్లు లత, సౌజన్య, కల్పన, విజన్ కన్వీనర్ దాము తదితరులు ఉన్నారు.

లక్ష్యాలను సకాలంలో సాధించాలి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 29: జిల్లా గ్రామీణాభివృద్ధి ద్వారా మహిళా సాధికారత దిశగా స్వయం సహాయక సంఘాలు అభివృద్ధి చెందేలా లక్ష్యాలను సాధించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రామీణాభివృద్ధి సంస్థ.. మహిళా సాధికారత దిశగా చేపడుతున్న పలు రకాల ప్రభుత్వ పథకాలపై సమీక్షించారు. ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సచివాలయ సిబ్బంది ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయం ఆరు గంటల నుంచే పంపిణీ చేయాలన్నారు. పథక సంచాలకులు ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 29: సీపీఆర్‌పై పద్మావతి యూనివర్సిటీలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఎస్ఎస్ - ఉమెన్ స్టడీస్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్విమ్స్ కార్డియాలజీ విభాగ డాక్టర్ నీరజ సీపీఆర్ ఎలా చేయాలో వివరించారు. అనస్తీషియా డాక్టర్ అలోక సమర్థరాయ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్పీ నుంచి రక్షణ కల్పించండి


మాట్లాడుతున్న గాయత్రి

తిరుపతి (జీవకోన), జూలై 29: మెప్మాలో విధులు నిర్వహిస్తున్న ఆర్పీ హేమలత నుంచి తనకు రక్షణ కల్పించాలని కొర్లగుంటకు చెందిన గాయత్రి మొరపెట్టుకున్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. హేమలత వద్ద గతంలో తాను కొంత నగదు తీసుకుని, తిరిగి చెల్లించేశానని చెప్పారు. అయినా ఆమె వద్ద ఉన్న చెక్కులు, బాండ్లు ఇవ్వకుండా వారం వడ్డీ, రోజు వడ్డీల పేరుతో తనను వేధిస్తోందని ఆరోపించారు. దీనిపై పోలీసులకు చెప్పినా ఫలితం లేకపోయిందని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయంచేయాలని కోరారు. అలాగే మరో బాధితురాలు మహేశ్వరి కూడా తన గోడు వెళ్లబోసుకున్నారు.

రోడ్డుగా అడ్డంగా రైల్వే అండర్ బ్రిడ్జి దిమ్మెలు

వాహన చోదకులకు తప్పని ఇబ్బందులు

సూళ్లూరుపేట, జూలై 29: రోజు రోజుకు విస్తరిస్తున్న సూళ్లూరుపేట పట్టణం ట్రాఫిక్ కష్టాల్లో చిక్కుకుంటోంది. పట్టణ నడిబొడ్డున రైల్వేట్రాక్ ఉండడయే దీనికి ప్రధాన కారణం. పట్టణం విస్తరించడంతో పాటు పెరిగిన జనాభా, వాహనాల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించేందుకు రైల్వే అధికారులు శ్రీకారం చుట్టారు. చకాచకా పనులు ప్రారంభించారు. అండర్ బ్రిడ్జి నిర్మాణంతో పట్టణం ఇబ్బందికర పరిస్థితిలోకి వెళ్తుందని పలువురు కోర్టును ఆశ్రయించడంతో పనులకు బ్రేక్ పడింది. ఆ బ్రిడ్జి నిర్మాణానికి తెచ్చిన భారీ సిమెంట్ దిమ్మెలు రైల్వే గేటుకు రెండు వైపులా నడిరోడ్డుపై వదిలేయడంతో వాహన చోదకులకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రైల్వే గేటుకు దక్షిణ వైపున ఉన్న రోడ్డులో ఆ దిమ్మెలు అడ్డంగా ఉండడంతో ఒక్కోసారి పాదచారులు కూడా రాకపోకలు సాగించలేని పరిస్థితి. రైల్వేగేటు వేసిన, తీసిన సమయంలో ద్విచక్ర వాహనాలు రెండు వైపులా బారులు తీరుతాయి. సిమెంట్ దిమ్మెలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేదెప్పుడో... అడ్డంగా ఉన్న ఈ దిమ్మెలు తొలిగించేదెప్పుడో... అంటూ పట్టణవాసుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉన్న అండర్ బ్రిడ్జికు సంబంధించిన సిమెంట్ దిమ్మెలను తొలగించాలని పట్టణవాసులు కోరుతున్నారు.



రైల్వేగేటు దక్షిణ వైపున రోడ్డుకు అడ్డంగా ఉన్న సిమెంట్ దిమ్మెలు - అడ్డంగా దిమ్మెలతో ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు

సముచిత స్థానం కల్పించండి

సర్పంచుల వినతి


కృష్ణతేజకు వినతిపత్రం అందిస్తున్న శివకుమార్

పెళ్లకూరు, జూలై 29: గత వైసీపీ పాలనలో అణచివేతకు గురై దిష్టి బొమ్మల్లాగా మారిన పంచాయతీ ప్రథమ పౌరులు సర్పంచులకు సముచిత స్థానం కల్పించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర సంచాలకుడు కృష్ణతేజను కోరినట్లు ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షుడు, జీలపాటూరు సర్పంచు కె.శివకుమార్ తెలిపారు. అమరావతిలో సోమవారం దీనిపై పలువురు సర్పంచులతో కలసి ఆయనకు వినతి పత్రం అందజేశామన్నారు. ఈ సందర్భంగా కేరళ తరహాలో రాష్ట్ర పంచాయతీలను అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి చేయూతనివ్వాలని కోరానన్నారు. ఉపాధి హామీ పథకం పనులను సర్పంచుల ఆధ్వర్యంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. సర్పంచుల గౌరవ వేతనం రూ.15 వేలకు పెంచాలని కోరామన్నారు. స్పందించిన రాష్ట్ర సంచాలకుడు కృష్ణతేజ... సమస్యలను పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని, నిధులు, అధికారాలు, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు శివకుమార్ తెలిపారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించండి


సబ్‌కలెక్టర్ వద్ద జరిగిన ధర్నా

గూడూరు అర్బన్, జూలై 29: చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ, ఏఐటీయూసీ, చేనేత కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చేనేత సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలను నిర్వహించాలన్నారు. నైపుణ్యాల రాయితీని రూ.2వేలు నుంచి రూ.3వేలుకు పెంచి ఇవ్వాలని, ముద్రా రుణాలు ఇచ్చినప్పుడే రాయితీ ఇవ్వాలన్నారు. చేనేత వస్త్ర ఉత్పత్తులకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆదరణ పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. చేనేతలకు ప్రత్యేక బ్యాంకులు ఏర్పాటు చేసి రాయితీలో రుణాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శశి, కాలేషా, చంద్రయ్య, నారాయణ, భాస్కర్, కోటయ్య, యశదమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి


పెన్నేపల్లి వద్ద అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పెళ్లకూరు, జూలై 29 : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తద్వార రోడ్డు ప్రమాదాలు జరిగితే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని ఎస్ఐ శ్రీకాంత్ సూచించారు. సోమవారం పెన్నేపల్లి వద్ద 71వ జాతీయ రహదారిపై హెల్మెట్ వినియోగంపై వాహనదారుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెయ్యదూడల ఉత్పత్తులపై అవగాహన


మహిళా రైతుకు మినరల్ మిక్చర్ ప్యాకెట్టును అందిస్తున్న నాయకులు

కోట, జూలై 29: మండలంలోని గూడలిలో సోమవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెయ్యదూడల ఉత్పత్తి అవగాహన కల్పించారు. అలాగే పశువైద్య శిబిరం నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ ఉమ్మడి నెల్లూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ సోమయ్య ఆధ్వర్యంలో 79 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా గొంతువాపు, గాలికుంటు, నీలినాలుక, లంపీస్కిన్ తదితర వ్యాధులకు మందులను, మినరల్ మిక్చర్‌ను పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గూడూరు, జూలై 29: స్థానిక పోటుపాళెం జాతీయ రహదారి కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... ఒంగోలుకు చెందిన హరిప్రసాద్, ప్రవీణ్‌రెడ్డి తిరుమల నుంచి ఒంగోలుకు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో పోటుపాళెం జాతీయ రహదారి కూడలి వద్ద నెల్లూరు నుంచి గూడూరు పట్టణంలోకి అకస్మాత్తుగా కారు రావడంతో అదుపుతప్పి బైక్ ఢీకొనింది. దీంతో బైక్‌పై వెళుతున్న హరిప్రసాద్, ప్రవీణ్‌రెడ్డి గాయపడ్డారు. వీరిని చికిత్సనిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్ఠం చేయండి

కలెక్టర్‌కు ఆపస్ నేతల విజ్ఞప్తి

తిరుపతి(విద్య), జూలై 29: జిల్లాలో ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) నాయకులు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన్ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి గట్ల సాంబిరెడ్డి, జిల్లా సహాధ్యక్షుడు డాక్టర్ ఎం. దేవరాజులు, మహిళా కన్వీనర్లు లత, సౌజన్య, కప్పన, విజన్ కన్వీనర్ దాము తదితరులు ఉన్నారు.

ఇద్దరు ఏఎస్‌ఐలకు పదోన్నతి

తిరుపతి(నేరవిభాగం), జూలై 29: తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఏఎస్‌ఐలకు పదోన్నతి లభించింది. తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న జి. నాగరాజును చిత్తూరుకు బదిలీ చేశారు.పార్థసారథిని తిరుపతిలోనే నియమించారు.

కామ్రేడ్ జనార్దన రెడ్డికి ఘన నివాళి

గూడూరు, జూలై 29: పేదల అభ్యున్నతికి, సమస్యల పరిష్కారానికి కామ్రేడ్ జనార్దన రెడ్డి ఎన్నో పోరాటాలను చేశారని సీపీఎం నాయకులు చెప్పారు.పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం సీపీఎం నాయకుడు జనార్దన రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయనకు నాయకులు ఘన నివాళి అర్పించారు. వెంకట్రామిరెడ్డి, శంకరయ్య, శ్రీనివాసులు, సురేష్, మణి, నరసింహులు, చంద్రయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రిలీవర్ రాక ముందే ఇంటికి...!

- గునపాటిపాళెం పీహెచ్‌సీలో ఇదీ పరిస్థితి

చిట్టమూరు, జులై 29: రోగులకు అందుబాటులో ఉండి వారికొచ్చిన వ్యాధిని గుర్తించి నయం చేయాల్సి సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోగులను ఆసుపత్రిలోనే వదిలేసి తట్టా... బుట్టా సర్దుకొని వెళ్లిపోతున్నారు గునపాటిపాళెం 24గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది. సోమవారం సాయంత్రం గునపాటిపాళెం నుంచి వృద్ధురాలిని ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆమెకు సక్రమంగా వైద్యం అందించకుండా సాయంత్రం 4 గంటలకు బ్యాగులు సర్దుకొని వెళ్లిపోయారు. అదే సమయంలో కోట మండలం ఊనుగుంటపాళెం నుంచి ఓ రోగిని అత్యవసర చికిత్స కోసం ఆటోలో ఈ ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. వైద్య సిబ్బంది లేరని వాచ్‌మేన్ చెప్పడంతో బతుకుజీవుడా అంటూ నాయుడుపేటకు తీసుకెళ్లారు.

షిఫ్ట్ విధానంలో సిబ్బంది నిర్లక్ష్యం...

గునపాటిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వర్తించాలి. ఇక్కడ ఇద్దరు వైద్యాధికారులున్నారు. ప్రధాన వైద్యాధికారి సాయంత్రం 4 గంటల్లోపే వెళ్లిపోయినట్లు తెలిసింది.


వృద్ధురాలిని వేరే ఆసుపత్రికి తీసుకెళ్తున్న బంధువులు

దాంతో ఓపీలో ఉండాల్సిన సిబ్బంది రిలీవర్ వచ్చే వరకు ఆసుపత్రిలో ఉండకుండా వెళ్లిపోయారు. జిల్లా వైద్యాధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


అత్తివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వీట్ల పంపిణీ

ఓజిలి, జూలై 29: మండలంలోని అత్తివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కుందాం సొసైటీ మాజీ అధ్యక్షుడు కె.గోపాల్‌రెడ్డి పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. కేంద్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల అభివృద్ధిలో

ముగిసిన శిక్షా సప్తాహ్

భాగంగా శిక్షా సప్తాహ్ పేరుతో వారం రోజులపాటు నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజు సామాజిక భాగస్వామ్య దినం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని వారం రోజులపాటు రోజూ విద్యార్థులకు ఆటల పోటీలతోపాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించినట్లు హెచ్‌ఎం టి.శోభనకుమారి తెలిపారు. సర్పంచి ఎస్.రమణయ్య, ఎ.గురుమూర్తి, అనిల్‌రెడ్డి సహా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాయుడుపేట: వారం రోజులుగా జరుగుతున్న శిక్షా సప్తాహ్ సోమవారంతో పూర్తయినట్లు ఎంఈవో బి.మునిరత్నం తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్యా బోధన, విద్యార్థులకు అనుగుణంగా సరళీకృత అభ్యాసాలపై శిక్షా సప్తాహ్ జరిగినట్లు తెలిపారు. నాయుడుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ ముగింపు సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు గాలి రమేష్‌నాయుడు భోజన సదుపాయం కల్పించారు. హెచ్‌ఎం సురేష్ బాబు, న్యాయవాది పసల గంగాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుమలలో ప్రమాదకరంగా ఉన్న వృక్షాల తొలగింపు


ఎంబీసీ వద్ద వృక్షాలను తొలగిస్తున్న సిబ్బంది

తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ప్రమాదకరంగా ఉన్న వృక్షాలను టీటీడీ ఫారెస్ట్ అధికారులు సోమవారం తొలగించారు. మూడు వారాలుగా తిరుమలలో భారీ ఈదురుగాలులకు కొన్ని వృక్షాలు కూలేందుకు సిద్ధమయ్యాయి. దీనిపై 'తిరుమలలో ప్రమాదకరంగా భారీ వృక్షాలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఫారెస్టు అధికారులు కూలేందుకు సిద్ధంగా ఉన్న వృక్షాలను తొలగిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే కొండపై వృక్షాలను మూడు విభాగాలుగా విభజించామన్నారు. మొదటి విభాగం కింద పుచ్చిపోయిన, పూర్తిగా చనిపోయిన చెట్లు ఉంటాయన్నారు. రెండో భాగంలో కొంతమేరకు దెబ్బతిన్న, సున్నితంగా ఉన్న వృక్షాలు, మూడో విభాగంలో బరువు అధికంగా ఉండి బలంగా ఉన్న చెట్లు ఉంటాయన్నారు. కొద్దినెలలుగా మొదటి విభాగంలోని వృక్షాలను తొలగిస్తూ వస్తున్నామన్నారు. ఇప్పటికే 60 శాతం పూర్తయ్యాయన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు.

ముస్తాబవుతున్న 'అన్నమయ్య' మీటింగ్ హాల్



తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అధికారులు, బోర్డు సమావేశాలు జరిగే అన్నమయ్య భవనంలోని సమావేశం మందిరం (మీటింగ్ హాల్) ముస్తాబవుతోంది. బోర్డు సమావేశాలతోపాటు డయల్ యువర్ ఈవో, ఈవో, జేఈవోల సాధారణ సమావేశాలన్నీ ఈ సమావేశం మందిరంలోనే జరుగుతుంటాయి. ఈ హాల్ మరమ్మతులకు గురవడంతో కొద్దినెలల క్రితం ఆధునికీకరణ పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం పనులు దాదాపుగా పూర్తకావచ్చాయి. దీంతో మీటింగ్ హాల్‌ను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు.

తిరుమలలో శ్రీవాణి టికెట్ల జారీకి శాశ్వత కౌంటర్

స్థలాలను పరిశీలించిన అదనపు ఈవో

తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవాణి ట్రస్టు భక్తులకు దర్శన టికెట్లు కేటాయించేందుకు శాశ్వత కౌంటర్ నిర్మాణం కోసం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి పలు ప్రాంతాలను పరిశీలించారు. గోకులం వెనుకభాగంలోని ఉన్న ఖాళీ స్థలాన్ని, ఆదిశేష విశ్రాంతి గృహం పక్కనే ఉన్న టీటీడీ కల్యాణమండపం ప్రాంతం, తిరుమల డీఎఫ్‌వో కార్యాలయాన్ని జేఈవో వీరబ్రహ్మంతో కలిసి సోమవారం పరిశీలించారు. భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా విశాలమైన ప్రదేశాన్ని ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీఈవో సెల్వం, ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

వ్యవస్థలను నిర్వీర్యం చేసిన జగన్

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

తిరుపతి (జీవకోన), జూలై 29: రాష్ట్రంలోని వ్యవస్థలన్నింటినీ మాజీ సీఎం జగన్ నిర్వీర్యం చేశాడని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ మండిపడ్డారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ తగులబెట్టడంపై ఆగ్రహించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. ఆంధ్రాలో ఓ కుటుంబం, తెలంగాణలో ఓ కుటుంబం వల్లే తెలుగు ప్రజలు కష్టాలు పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీ కార్పొరేషన్ కొనసాగిస్తూ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై టీటీడీ ఏడీ బిల్డింగ్ ముందు కూడా చింతామోహన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.

1న విష్ణు సహస్ర నామ అఖండ జప యజ్ఞం

తిరుపతి (జీవకోన), జూలై 29: ఆలిండియా విష్ణు సహస్ర నామ కల్చరల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు ఒకటో తేదీన తిరుమల ఆస్థాన మండపంలో విష్ణు సహస్రనామ అఖండ జప యజ్ఞం చేపడుతున్నట్లు ఫెడరేషన్ ఛైర్మన్ నాగేంద్రసాయి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. జనహితం కోరుతూ 35 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. 1న ఉదయం ఆరు గంటల నుంచి మొదలుపెట్టి రెండో తేదీ ఉదయం 10గంటల వరకు నిరంతరాయంగా 27 గంటలపాటు జపయజ్ఞం జరుగుతుందన్నారు. తిరుమల జీయరు స్వాములతో యజ్ఞం ప్రారంభమవుతుందన్నారు. ముగింపు కార్యక్రమానికి అహోబిలం జీయర్ స్వామి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ హాజరవుతారన్నారు.

జూపార్కులో పులుల దినోత్సవం

మంగళం, జూలై 29: ఎస్వీ జూపార్కులో సోమవారం ప్రపంచ పులుల దినోత్సవం సెట్విన్ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పులులను పరిరక్షించడం, పర్యావరణాన్ని కాపాడుకోవడం అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. జూ క్యూరేటర్ సెల్వం మాట్లాడుతూ.. విద్యార్థులకు పెద్దపులుల ప్రాధాన్యం, అడవులు ప్రాముఖ్యతను వివరించారు. అధికారులు జగదీష్, నాగభూషణం, మురళీకృష్ణ, చంద్రప్రసాద్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో టైగర్స్ డే



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్

సూళ్లూరుపేట, జూలై 29: పట్టణంలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ టైగర్స్ డేను ఘనంగా నిర్వహించారు. కళాశాల జంతుశాస్త్రం, ఎకో క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణలో పులుల పాత్ర కూడా ఉందన్నారు. దేశవ్యాప్తంగా పులుల సంఖ్య క్రమేపి తగ్గిపోతోందని, వాటిని సంరక్షించేందుకే కేంద్రప్రభుత్వం టైగర్ ప్రాజెక్టును ప్రవేశపెట్టిందన్నారు. దీని వల్ల ప్రస్తుతం పులుల సంఖ్య కూడా పెరిగిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా మన దేశంలోనే 70 శాతానికి పైగా పులులు ఉన్నాయని అంచనా వేశారన్నారు. అధ్యాపకులు శ్రీనివాస్, సుబ్రమణ్యం శాస్త్రి, డాక్టర్ టీకే ప్రసాద్, ఆర్ శరత్‌బాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు


అవగాహన కల్పిస్తున్న శారద

నాయుడుపేట టౌన్, జూలై 29: ఆయిల్‌పాం సాగుతో రైతులకు అధికలాభాలు ఉంటాయని మండల ఉద్యాన వన శాఖ అధికారి శారద అన్నారు. నాయుడుపేట ఉద్యానవనశాఖ కార్యాలయంలో సోమవారం ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగుకు హెక్టార్‌కు 150 మొక్కలు నాటుకోవాలని తెలిపారు. సాగులో 5వ విడత నుంచి హెక్టారుకు రెండు టన్నుల నుంచి 10 టన్నులు వరకు దిగుబడి వస్తుందన్నారు.

పథకాలు పూర్తిస్థాయిలో అందడం లేదు


ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి

నాయుడుపేట, జూలై 29: ప్రభుత్వం ఏర్పడి 55 రోజులు కావస్తున్నప్పటికీ ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడు పేటలోని వైసీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం పథకాలు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయే తప్ప నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. ఎంపీపీ ధనలక్ష్మి, ఏఎంసీ ఆజీ ఛైర్మన్ జనార్దన రెడ్డి, టి.సుబ్రహ్మణ్యంరెడ్డి, కె.జయరామ్, చదలవాడ కుమార్, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు భూముల పరిశీలన

పెళ్లకూరు, జూలై 29: మండలంలో ల్యాండ్ కన్వర్షన్ కోసం విన్నవించుకున్న వ్యవసాయ భూములను ఆర్డీవో చంద్రముని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అనకవోలు గ్రామానికి చేరుకుని స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం అక్కగారిపేటలో ల్యాండ్ కన్వర్షన్ కోసం కోరిన లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. అనుమతి లేకుండా లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన ప్రహరీ నిర్మాణంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి పూర్తి స్థాయి నివేదిక తనకు పంపించాలని తహసీల్దార్ ప్రసాదరావ్, వీఆర్వో మొబీనాను ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించిన లేఅవుట్ నిర్వాహకులను జరిమానాతో కూడిన అనుమతులు మంజూరు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. అన్నీ అనుమతులు వచ్చిన తరువాత పనులు ప్రారంభించాలన్నారు. వీఆర్వో వంశీకృష్ణ, మండల సర్వేయర్ పూజిత, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి టీటీడీ సారె



తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి తిరుమల శ్రీవారి ఆలయం తరపున పట్టువస్త్రాలను టీటీడీ ఈవో శ్యామలరావు సోమవారం సమర్పించారు. టీటీడీ అధికారులకు తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఛైర్మన్ శ్రీధర్, జూయింట్ కమిషనర్ అరుణాచలం, తిరుత్తణి ఆలయ బోర్డు సభ్యులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈవో వెంట డిప్యూటీ ఈవో లోకనాథం, పారుపత్తేదార్ తులసి ప్రసాద్, వేదపారాయణదారులు ఉన్నారు.

కిడ్నాప్ కేసులో ఆర్‌ఎంపీ సహా నలుగురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), జూలై 29: తిరుపతికి చెందిన కొబ్బరికాయల వ్యాపారి జంగం భాస్కర్ కిడ్నాప్ కేసులో నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు.ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాకు కిడ్నాప్ కేసుకు సంబంధించి వివరించారు.చిన్నగొట్టిగల్లు మండలం చెరువుముందర పల్లెకు చెందిన జంగం భాస్కర్ తిరుపతిలో కొబ్బరికాయల వ్యాపారం చేస్తూ ఆటో నడుపుకుని జీవిస్తున్నాడు.ఇటీవల ఆర్థికంగా బాగా ఎదగడంతో అతడిని కిడ్నాప్ చేసి భారీ ఎత్తున డబ్బు సంపాదించవచ్చని చిన్నగొట్టిగల్లుకు చెందిన బాతుకోళ్ళ మహ్మద్ జీషాన్, ఇర్ఫాన్ పథకం పన్నారు. సొంత పనిమీద స్వగ్రామానికి వెళ్లిన భాస్కర్ ఈ నెల 24న ఉదయం 8.45 గంటల ప్రాంతంలో తన ఆటోలో తిరుపతికి వస్తుండగా జీషాన్, ఇర్ఫాన్ తమ స్నేహితులైన బెంగళూరులోని శివాజీనగర్‌కు చెందిన అర్యంఖాన్, లింగరాజుపురానికి చెందిన మహ్మద్ ఖాసిం సహాయంతో భాకరాపేట ఘాట్‌రోడ్డులోని పెట్రోలు బంకు సమీపంలో కిడ్నాప్ చేశారు. అతను అరవకుండా మహల్ గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ షేక్ జాహిద్ బాషా నుంచి కొనుగోలు చేసిన మత్తు మందును భాస్కర్‌కు ఇచ్చారు. ఎలాగైనా కిడ్నాప్ చేసి భారీ ఎత్తున డబ్బులు డిమాండ్ చేయాలనే ఆలోచనతో అంతకుముందు భాస్కర్ కదలికలపై రెక్కీ నిర్వహించారు.భాస్కర్‌ను రోజంతా తమ కారులోనే వివిధ ప్రాంతాల్లో తిప్పారు. భాస్కర్ కుమారుడు కిరణ్‌కు ప్రధాన నిందితుడు మహ్మద్ జీషాన్ ఫోన్ చేసి రూ.5 కోట్లు తెచ్చివ్వాలని బెదిరించారు. దీంతో కిరణ్ ఎస్పీకి ఫోన్ చేసి కిడ్నాప్ విషయం తెలిపాడు.వెంటనే ఏఎస్పీ కులశేఖర్ నేతృత్వంలో క్రైం డీఎస్పీ రవికుమార్, సీఐలు శ్రీనివాసులు, శ్రీకాంత్ రెడ్డి, వినోద్‌కుమార్, సీఐ మస్తాన్ వలి నేతృత్వంలో గాలింపు చర్యలు చేపట్టారు.కిడ్నాప్ కోసం వాడుతున్న కారును 29న ఉదయం 7గంటల ప్రాంతంలో భాకరాపేట ఘాట్ రోడ్డులో ఊర్జా హోటల్ వద్ద గుర్తించారు.అయితే పోలీసు వాహనాన్ని ఢీకొట్టి పరారైన నిందితులను కాలూరు క్రాస్ వద్ద అరెస్టు చేశారు. కిడ్నాప్‌కు వాడిన కారు, డమ్మీ పిస్టల్, మత్తు ఇంజెక్షన్లు ఇవ్వడానికి వాడిన సిరంజీలను స్వాధీనం చేసుకున్నారు.ఇర్ఫాన్ తప్పించుకోగా ఆర్‌ఎంపీతో పాటు ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేశారు.ముద్దాయిల్లో మహ్మద్ జీషాన్ కిరాతకమైన నేర చరిత్ర కలిగిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.మిగిలిన వారిపైనా బెంగళూరు, చిన్నగొట్టిగల్లు ప్రాంతాల్లో ఎర్రచందనం, దోపిడీ, దొంగతనం కేసులున్నాయని, వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు.

నిందితులపై రౌడీషీట్ తెరిచేందుకు ఎస్పీ ఆదేశాలు


కిడ్నాపర్లను చూపించి వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ఠ నిఘా ఉంచాలి

● ఎస్పీకి విన్నవించిన ఎమ్మెల్యే ఆదిమూలం



పిచ్చాటూరు, జూలై 29: సత్యవేడు నియోజకవర్గం శాంతి భద్రతల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే ఆదిమూలం ఎస్పీ సుబ్బరాయుడు ను కోరారు. సోమవారం తిరుపతిలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీని ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలోని 5 మండలాలు తమిళనాడు సరిహద్దుగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ఠ నిఘా ఉంచాలని కోరారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోరారు. నియోజకవర్గంలో చెదురు మదురు సంఘటనలు జరిగితే పక్కా ఆధారాలు లేకుండా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదుచేయవద్దని, వీలైనంత మేరకు సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. ఇందుకు జిల్లా ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

లో వోల్టేజీతో విద్యుత్ వైర్లలో చెలరేగిన మంటలు



విద్యుత్ స్తంభంలో మంటలు వస్తున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 29: మండల కేంద్రంలోని ఈబీసీ కాలనీలోని ఓ వీధిలో ఆదివారం అర్ధరాత్రి లో వోల్టేజీతో విద్యుత్ వైర్లలో మంటలు చెలరేగాయి. దీంతో కాలనీ వాసులు భందోళనకు గురయ్యారు. విద్యుత్ శాఖ అధికారులు సోమవారం విద్యుత్ సరఫరా కోసం సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కరెంట్ సరఫరా రావడం లేదని కాలనీ వాసులు తెలిపారు. లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 29: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయ అధికారి భారతి సోమవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలను పంట పొలాల్లో సాగు చేయడం వలన భూమిలో సత్తువ పెరుగుతుందన్నారు. 10కేజీలు జీలగల ధర రూ.800లు కాగా 50శాతం రాయితీపై రూ.440కు, 10కేజీల జనుములు రూ.1070లు కాగా రూ.535కు, పిల్లిపెసర 10కేజీలు రూ.1070లు కాగా రూ.535కు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. బయోమెట్రిక్ ద్వారా రైతులకు ఈ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకారంలో మృత్యుంజయస్వామి

శ్రీకాళహస్తి, జూలై 29: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి అభిషేకం నిర్వహించి, కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామికి పాలు, పంచామృతం, చందనం, విబూది, పచ్చకర్పూరంతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

4న రక్తదాన శిబిరం

శ్రీకాళహస్తి, జూలై 29: యువతరం సేవాసమితి 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 4వ తేదీ ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు పక్కన గల పట్టణ నిరాశ్రయుల వసతిగృహంలో ఈ రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రక్తదాతలు పెద్దసంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని వారు కోరారు.

హరోం హర.. శరణు.. శరణు..

విజ్ఞానగిరికి పోటెత్తిన భక్తులు

ఇంద్ర విమానం, నెమలి వాహనంపై స్కంధుడి విహారం

నారద పుష్కరిణి వద్ద తలనీలాల సమర్పణ

షణ్ముగ.. కార్తికేయా, చెంగల్వరాయ, వడివేలా.. మురుగా... తిరుత్తణి వాస, అప్పనే... హరోం.. హర.. నామస్మరణతో సోమవారం శ్రీకాళహస్తిలోని విజ్ఞానగిరి మార్మోగింది. ఆడికృత్తిక సందర్భంగా పసుపు పచ్చని దుస్తులు ధరించి కాలినడకన కావడి మోసే భక్తులు... నారద పుష్కరిణి వద్ద తలనీలాలు సమర్పించే వారు... కుమారస్వామిని దర్శించుకోవడానికి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు.



నెమలి వాహనంపై ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి, జూలై 29: శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో ఈ నెల 24వ తేదీ నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా సోమవారం ఆడికృత్తిక ఉత్సవాలు నిర్వహించారు. పట్టణ వాసులతో పాటు.. గ్రామీణ ప్రాంతాలకు చెందిన భక్తులు కావడి మోస్తూ విజ్ఞానగిరికి తరలివచ్చారు. కొండపైకి వెళ్లి స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు విజ్ఞానగిరిపై భక్తుల రద్దీ కొనసాగింది. ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తి పట్టణంలో పలువురు ఉచితంగా ప్రసాదాలు పంపిణీ చేశారు. విజ్ఞానగిరికి వేలాది మంది భక్తులు తరలి రావడంతో రద్దీని నియంత్రించడానికి రెండు మార్గాలు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్టాండు వైపు ఉన్న మార్గం గుండా భక్తులను కొండపైకి అనుమతించారు. బాబు అగ్రహారం వైపు నుంచి కిందకు దించారు. పలువురు భక్తులు నారదపుష్కరణి వద్ద తలనీలాలు సమర్పించి అక్కడే స్నానాలు చేశారు. విజ్ఞానగిరిపై ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ఆలయ అధికారులు స్వయంగా ఏర్పాట్లను పరిశీలించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు చెందిన 150 మంది విద్యార్థులు క్యూలైన్ల వద్ద భక్తులకు సేవలు అందించారు. తాగు నీరు అందించడంతో పాటు చిన్నపిల్లలు, వృద్ధులకు చేతి సాయం దర్శనభాగ్యం కల్పించారు.



ఇంద్ర విమానంపై వళ్లీ దేవసేన సమేత కుమారస్వామి





క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు, ప్రసాదాలు పంపిణీ చేస్తున్న ఈవో

ఇంద్ర విమానంపై స్కంధుడి పురవిహారం

ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం వళ్లీ దేవసేన సమేత కుమారస్వామి ఇంద్ర విమానంపై పురవిహారం చేశారు. స్వామి అమ్మవార్లకు భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నెమలి వాహనంపై...

రాత్రి తనకిష్టమైన నెమలి వాహనంపై వళ్లీ దేవసేన సమేత కుమారస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ముక్కంటి ఆలయంలో అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం చప్పరంపై వాహన మండపానికి చేర్చారు. అక్కడ నెమలి వాహనంపై అధిష్ఠింపజేసి, మంగళవాయిద్యాలు, మేళతాళాలతో చతుర్మాడ వీధుల్లో ఊరేగించారు. ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా ఆడికృత్తిక ఉత్సవాలు





కావళ్లతో స్వామి దర్శనానికి వస్తున్న భక్తులు, కాలభైరవ స్వామి దర్శన టికెట్ కొంటున్న ఆదిమూలం



జనసంద్రంగా రామగిరి కొండ

పిచ్చాటూరు, జూలై 29: రామగిరి వాలీశ్వర స్వామి దేవాలయానికి అనుబంధంగా ఉన్న కుమార సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి ఆడికృత్తిక అభిషేకాలు, రాత్రి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో భక్తులు కావళ్లు ఎత్తుకుని హరోం... హర అంటూ రావడంతో రామగిరి కొండ ఆలయం కిక్కిరిసిపోయింది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవ దారులుగా రజానగరం చెంచు రామానాయుడు, మునిరత్నమ్మ, సుశీల ప్రత్యేక పూజలు నిర్వహించారు. వళ్లీ దేవసేన సమేత కుమార సుబ్రహ్మణ్యస్వామిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి యాలి వాహనంపై పురవీధుల్లో మేళతాళాల నడుమ శాస్త్రోక్తంగా ఊరేగించారు. సుబ్రహ్మణ్యస్వామి, వాలీశ్వరస్వామి, కాలభైరవస్వాములను టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డితో కలసి ఎమ్మెల్యే ఆదిమూలం దర్శించుకున్నారు. ఆలయ ప్రవేశ టికెట్ కొని స్వామివారిని దర్శించుకుని మంచి సాంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. రామగిరిని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి రూ.3 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందచేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

నాగలాపురం: మండల పరిధిలోని సురుటుపల్లె పల్లి కొండేశ్వరాలయంలో వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు అర్చకులు అభిషేకాలు నిర్వహించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు వెండి కవచాలు తొడిగి, పుష్పాలతో అలంకరించి, మహా హారతి చేపట్టారు. భక్తులు హరోంహర అంటూ సుబ్రమణ్య స్వామిని దర్శించుకున్నారు.

సత్యవేడు: సత్యవేడులోని బాల మురుగన్ స్వామి ఆలయంలో స్వామి వారిని పట్టు వస్త్రాలు, ఆభరణాలు, వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి, పూజాభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున కావళ్లతో ఆలయానికి విచ్చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు స్థానిక వన్నియర్ సంఘం అధ్యక్షుడు దర్శన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



కేవీబీపురం నుంచి రామగిరికి ఆటో, మోటర్‌బైక్‌పై వెళుతున్న భక్తులు

కేవీబీపురం: మండలంలోని భక్తులు అటు శ్రీకాళహస్తి, ఇటు రామగిరికి పెద్దఎత్తున కాలినడకన, ఆటోలు, ద్విచక్ర వాహనాలు తదితరాలపై పెద్దఎత్తున సోమవారం తరలి వెళ్లారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం నుంచి కృత్తిక మొదలు కావడంతో ఎక్కువగా సాయంత్రం వేళలో ఆటోలకు డిమాండ్ ఏర్పడింది.



నాగలాపురంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని తేరువీధి, తొట్టంబేడు మండలం చెన్నై రోడ్డులో వెలసిన సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.



ప్రత్యేక అలంకారంలో శ్రీకాళహస్తి తేరువీధిలోని సుబ్రహ్మణ్యస్వామి

ఐఐటీలో మెరుగైన పరిశోధనావకాశాలు



మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు, జూలై 29: ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో నూతనంగా బీటెక్, ఎంటెక్, ఎంఎస్సీ, పీహెచ్‌డీలో చేరిన విద్యార్థులకు నూతన విధానాలపై ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తగా ఐఐటీలో చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఐఐటీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న అకాడమిక్ ప్రోగ్రాంలు, పరిశోధన అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని చెప్పారు. క్యాంపస్‌లో ఉండే సౌకర్యాలు, మౌలిక వసతులు, ఐఐటీ అందించే సేవలను వివరించారు. అనంతరం అధ్యాపకులు, ప్రతినిధులతో కలిసి విద్యార్థుల తల్లిదండ్రులు క్యాంపస్ టూర్ నిర్వహించారు. ఐఐటీలో ఉన్న సదుపాయాలను వారు పరిశీలించారు.

గాజుపెంకుతో దాడి - ఒకరికి తీవ్ర గాయాలు

సత్యవేడు, జూలై 29: పట్టణంలో పంక్చర్ షాపు నడుపుకుంటున్న ఒక వ్యక్తిపై పక్కషాపుకు చెందిన బైక్ మెకానిక్ గాజుపెంకుతో దాడి చేసి గాయపర్చిన సంఘటన సత్యవేడులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ వీరాంజనేయులు తెలిపిన వివరాల మేరకు... స్థానిక శ్రీకాళహస్తి బస్టాండ్ సమీపంలో అక్బర్ పంక్చర్ షాపు, సురేష్ బైక్ మెకానిక్ షాపు నిర్వహించుకుంటున్నారు. ఆదివారం వీరిమధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో సురేష్ కిటికీకి అమర్చే గాజుపెంకుతో అక్బర్‌పై దాడిచేయడంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం అక్బర్‌ను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం డాక్టర్లు అక్బర్‌ను చెన్నైకు రెఫర్ చేయగా, ప్రస్తుతం అక్కడ ఆయన ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడికి పాల్పడ్డ సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా అక్బర్ కూడా సురేష్‌పై దాడికి పాల్పడ్డాడని, అతడు కూడా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలపడం గమనార్హం.

పుత్తూరు వార్తలు

వైభవంగా ఆడికృత్తిక ఉత్సవాలు



తడుకు గ్రామంలో కావళ్లతో వెళుతున్న భక్తులు



ఆలయంలో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు టౌన్, జూలై 29: మండలంలో ఆడికృత్తిక ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. హరోం... హర నామస్మరణలతో సుబ్రమణ్యస్వామి ఆలయాలు మార్మోగాయి. కావళ్లు మోసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పుత్తూరు పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఉన్న వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయం, తడుకు వద్ద గల మలేషియా మురగన్ ఆలయాలలో భక్తులు కావళ్లతో మొక్కులు తీర్చుకున్నారు. ఉదయమే స్వామివారికి నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలకరించారు. చుట్టుపక్కల గ్రామాలు, గేట్ పుత్తూరు నుంచి చిన్నపిల్లలు, మహిళ భక్తులు కావళ్లతో కాలినడకన ఆలయానికివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు క్యూలైన్ల ద్వారా స్వామి దర్శనం భాగ్యం కల్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు ఆధ్వర్యంలో పట్టణంలోని సుబ్రమణ్య స్వామి ఆలయంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. టీడీపీ నాయకులు రవి నాయుడు, ధనపాల్, శ్రీజ, బాలాజీ నాయుడు, చంద్రయాదవ్, దాసరి విజయ్, బాబు రెడ్డి, ప్రవీణ్ నాయుడు, అజయ్ చౌదరి, మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆండాల్ తిరువడిపురం ఉత్సవం



గ్రామ వీధుల్లో ఊరేగుతున్న ఆండాల్ అమ్మవారు

నారాయణవనం, జూలై 29: మండల కేంద్రమైన నారాయణవనంలో వెలసిన కల్యాణ వెంకన్న ఆలయంలో ఆండాల్ తిరువడి పురం ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై ఆండాల్ అమ్మవారు గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. సూపరిటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లెమడుగులో పర్యాటక అభివృద్ధి



పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట, జూలై 29: పర్యాటక అభివృద్ధికి మల్లెమడుగు అనువైన ప్రదేశమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. సోమవారం సాయంత్రం పర్యాటకశాఖ అధికారులతో కలిసి కలెక్టర్ మల్లెమడుగు రిజర్వాయర్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దర్శనం కోసం ప్రపంచ నలుమూలల నుంచి ప్రతిరోజు సుమారు లక్షమంది వస్తుంటారని తెలిపారు. వారు కనీసం రెండురోజులు బసచేసేలా మల్లెమడుగును పర్యాటకంగా అభివృద్ధి చేస్తే బాగుంటుందని, ప్రభుత్వానికి కూడా ఆదాయం వస్తుందన్నారు. అధికారులు రమణప్రసాద్, రూపేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



సుమతి భర్తను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, జూలై 29: శ్రీకాళహస్తి పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు సుమతమ్మ భర్త, నియోజకవర్గ టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి రవీంద్ర నాయుడు ఇటీవల గుండెపోటుకు గురై చెన్నైలో చికిత్స పొంది ప్రస్తుతం పట్టణంలోని వారి స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. సోమవారం ఆయనను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి పరామర్శించారు. టీడీపీ నాయకులు పేట బాలాజీరెడ్డి, మునిరాజాయాదవ్, ఎంఎస్ రెడ్డి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం తహసీల్దార్‌గా జగన్మోహన్

నాగలాపురం, జూలై 29: నాగలాపురం నూతన తహసీల్దార్‌గా యం.జగన్మోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్ నరసింహులు సొంత జిల్లాకు వెళ్లిపోయారు. దీంతో శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జగన్మోహన్‌ను ఇక్కడకు బదిలీ చేశారు.

మాతాశిశు ఆరోగ్య సంరక్షణకు చర్యలు

వరదయ్యపాళెం, జూలై 29: వైద్యసిబ్బంది మాతా శిశు సంరక్షణకు చర్యలు చేపట్టాలని డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం కాంబాకం పంచాయతీలోని హెల్త్‌సెంటర్‌ను జిల్లా టాస్క్‌ఫోర్సు సభ్యులు పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలతో సమావేశం నిర్వహించారు. స్టాటికల్ ఆఫీసర్ నాగేంద్ర కుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే హమాలీల సమస్యలను పరిష్కరించండి

రేణిగుంట, జూలై 29: రైల్వే గూడ్స్ షెడ్ హమాలీలు, సీఆర్ఎస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని స్టేషన్ ఇన్‌చార్జి జ్ఞానేంద్రకుమార్, సీఆర్ఎస్ డిప్యూటీ సీఎంఈ రమేష్‌కు సీఐటీయూ అనుబంధ సంస్థ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి మునిరాజా.. కార్మికులు, సీపీఎం నాయకులతో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. రైల్వే హమాలీ కార్మికులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

తప్పుడు రికార్డులు తయారుచేసిన అధికారులపై చర్యలు చేపట్టాలి

వరదయ్యపాళెం, జూలై 29: తప్పుడు రికార్డులు తయారుచేసిన అధికారులపై చర్యలు చేపట్టాలని టీడీపీ నాయకుడు నూతలపాటి జయచంద్ర నాయుడు విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఇందిరానగర్ పంచాయతీ సచివాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా ఆయన అర్జీని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరదయ్యపాళెం విజ్ఞానగర్ నుంచి ముస్లింపాళెం పంచాయతీలోని గౌసియా నగర్ వరకు వేసిన రోడ్డుపై విచారణ జరపాలన్నారు. దీనిపై తప్పుడు రికార్డులు తయారుచేసిన అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. 30 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి బీజేపీ నేత చొరవ



పాఠశాల ఆవరణలో మట్టితో చదును చేయిస్తున్న కోటేశ్వరరావు

వరదయ్యపాళెం, జూలై 29: మండలంలోని వెంగారెడ్డి కండ్రిగ పాఠశాల అభివృద్ధికి స్థానిక బీజేపీ నేత కోటేశ్వరరావు ముందుకు వచ్చారు. లోతట్టు ప్రాంతంలో ఉండటంతో ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల ఆవరణలో నీరు నిలిచి బురదగా మారింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు కోటేశ్వరరావు స్పందించి.. తన సొంత నిధులతో సోమవారం పాఠశాల ఆవరణలో చదును చేయించారు. పలువురు ఆయనను అభినందించారు.